

# రెండేండ్ల టీఆర్ఎస్ పాలన – ఒక పరిశీలన

## తెలంగాణ విద్యావంతుల వేదిక

# తెలంగాణ రాష్ట్రంలో పౌర, ప్రజాస్వామిక హక్కులు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వం పండుగ వాతావరణాన్ని నెలకొల్పి, ఉద్యమ చరిత్రను, ప్రజల ఆరాట, పోరాటాల ఘట్టాలను మననం చేసుకొంటుంది. ఉద్యమ సమయంలో ప్రజలు వ్యక్తపరచిన ఆకాంక్షలు కార్యరూపం దాల్చుతున్న, దాల్చిన వైనాన్ని కూడా పత్రికల ద్వారా, టి.వి. ఛానెళ్ళ ద్వారా బహిర్గతపరుస్తుంది.

ప్రజల ఆకాంక్షల మేరకు ప్రభుత్వం పరిపాలిస్తుందా అనేది ఒక కోణం అయితే, ఆ ఆకాంక్షల్ని వ్యక్త పరుస్తూ అధికారంలోకి వచ్చేముందు ప్రకటించిన ఎన్నికల మానిఫెస్టోలోని అంశాల వెలుగులో కూడా ప్రభుత్వ పాలనను బేరీజువేవలసి వుంది. మానిఫెస్టోలో పౌర, ప్రజాస్వామ్య హక్కులకు తెలంగాణ రాష్ట్రంలో బరోసా వుంటుందని చాలా స్పష్టంగా చెప్పారు. పౌర, ప్రజాస్వామిక హక్కుల్లో భావ ప్రకటన స్వేచ్ఛ, వ్యవస్థపై వివిధ కోణాల్లో విమర్శ, పాలనా యంత్రాంగంపై విమర్శలు అంశాలుగా వుంటాయి. కాని తెలంగాణ ప్రభుత్వం ఈ మూడు అంశాల వక్రీకరణ విషయంలో తీవ్ర అసహనాన్ని ఈ రెండు సంవత్సరాలు ప్రదర్శిస్తూ వచ్చింది. "రాజకీయ ప్రత్యామ్నాయ వేదిక" హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన సెమినార్ అసలు జరుపుకోనివ్వకుండా, పూర్తిగా పోలీసు శాఖ నిర్ణయానికే వదిలివేసారు. గతంలో ఎంత నిర్బంధం వున్న సుందరయ్య భవన్ హాల్‌లో సమావేశాలపై ఆంక్షలు పెట్టలేదు. ర్యాలికి అనుమతి నిరాకరించిన హాల్‌లో జరుపదలచిన సమావేశాన్ని కొన్ని షరతులతోనైనా అనుమతించవలసి వుండే. ఆ సమావేవాలకు రహస్యంగా వుండే నక్సలైట్ కార్యకర్తలు హాజరవుతారని, ఈ సమావేశాలు జరిగితే ప్రశాంతంగా వున్న తెలంగాణలో మళ్లీ మవోయిస్టు పార్టీ కార్యక్రమాలకు అంకురార్పణ జరుగుతుందని నిఘా వర్గాల అభిప్రాయాన్ని ప్రభుత్వం పూర్తిగా విశ్వసించింది.

గతంలో జిల్లా కలెక్టర్ల కార్యాలయాల ముందు ధర్నాలు చేస్తుండే వారు. మామూలుగా పోలీసులకు సమాచారం ఇస్తే సరిపోయేది. కాని తెలంగాణ వచ్చిన తరువాత జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు, ప్రదర్శనలు నిషేధించారు. పోలీసులు సూచించిన దూరంగా వున్న స్థలంలో ధర్నా చేస్తే పోలీసులు వచ్చి ఇద్దరు ప్రతినిధులు తీసుకెల్లి మెమోరాండం సమర్పించడానికి తోడ్పడుతున్నారు. ఇదే చాలా మంచి ప్రాక్టీసుగా ఎస్పీ స్థాయి అధికారులు అభిప్రాయపడుతున్నారు. పి.డి.ఎస్.యు., తెలంగాణ విద్యార్థి వేదిక, తెలంగాణ ప్రజా ఫ్రంట్‌తో సహా ఇంకా కొన్ని సంస్థలు తలపెట్టిన ప్రజాస్వామిక కార్యక్రమాలపై తీవ్ర నిర్బంధాన్ని కొనసాగించారు. ఇంకా కొనసాగుతుంది. గత సంవత్సరం నల్లగొండ జిల్లాలో "తెలంగాణ విద్యార్థి వేదిక" తలపెట్టిన సెమినార్, బహిరంగ సభపై నిర్బంధ పరకాష్టగా చెప్పుకోవచ్చు. అనుమతి నిరాకరించడంతో హరగోపాల్ గారు రాష్ట్ర హోంమంత్రిని కలిసి మాట్లాడడంతో పోలీసుల నిఘాలో సభ జరిగింది. అందరి ఫోటోలు తీసుకున్నారు. ఐడెంటిటీ కార్డు వున్న వారినే హాల్‌లోకి పోవడానికి అనుమతించారు. సభ కార్యక్రమాలన్నీ వీడియో చిత్రీకరణ చేసారు. ఆ సంస్థ నాయకుల ఇండ్లలోకి పోలీసులు వెళ్ళి తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేసారు. హక్కుల సంఘాలు ఎన్‌కౌంటర్ విషయంలో స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రభుత్వం ముందు డిమాండ్ పెడుతున్నాయి. ఎన్‌కౌంటర్ ప్రక్రియ పూర్తిగా ప్రభుత్వ పాలనాపరమైన నిర్ణయంగా గతంలో కొనసాగిందని, పోలీసులకు ప్రమోషన్లు, క్యాష్ అవార్డులిచ్చి ప్రభుత్వాలు పోలీసుల్ని ప్రోత్సహించి ఒక అమానవీయ సంస్కృతికి పునాదులు వేసాయని, కనీసం "బూటకపు ఎన్‌కౌంటర్లు" వుండవనే ప్రకటన చేయాలని ప్రభుత్వాన్ని అడిగాం. ఈ విషయంపై ఈ ప్రభుత్వ ధోరణి ప్రశ్నిస్తే గతంలో నక్సలైట్లను అణిచివేసే విషంలో పోలీసులకు పూర్తి అధికారాలిచ్చారు. ప్రమోషన్లు, క్యాష్ అవార్డులిచ్చి పోలీసుల్లో నేరం చేసినా శిక్ష వుండదనే సంస్కృతిని ప్రోత్సహించాయి. ఈ సమస్యపై ఏర్పడ్డ "తెలంగాణ ప్రజాస్వామిక వేదిక" కార్యక్రమాలను అనుమతించడం లేదు. ఇటువంటి కార్యక్రమాలను అనుమతిచ్చే విషయంలో ప్రభుత్వం పూర్తిగా పోలీసు శాఖకే వదిలివేసింది. ఇటు సభలు నిర్వహించడంవల్ల ఏర్పడే పరిస్థితిపై ప్రభుత్వం ఒక సహేతుకమైన స్వతంత్ర ఆలోచనతో వ్యవహరిస్తే బాగుండేది. పీపుల్స్‌వార్ లాంటి పార్టీని కూడా చర్చలకు ఆహ్వానించి, వారి అభిప్రాయాలను ఆలకించిన విషయాన్ని ఈ ప్రభుత్వం గుర్తుపెట్టుకోదలచకపోవడం విచారకరం. మామూలు సమస్యలు ప్రభుత్వ దృష్టికి, సంబంధిత మంత్రి దృష్టికి తెచ్చే ప్రయత్నాలను కూడా ప్రభుత్వం హర్షించడంలేదు. గత సంవత్సరం వరంగల్‌లోని బిల్ట్స్ (బి.ఐ.ఎల్.టి.ఎస్) పాత కమలాపూర్ రేయిన్స్ ప్యాక్టరీ మూతపడింది. కార్మికులకు చట్టపరంగా రావలసిన ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ చెల్లింపుల విషయంలో కార్మిక శాఖ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న హోంమంత్రిని కలవడానికి కార్మికులు వస్తుండగా జనగామ దగ్గర పోలీసులు ఆపివేసి వరంగల్‌కు వెనక్కి పంపారు. కార్మిక నాయకులను రోజంతా నిర్బంధంలో వుంచారు. మహబూబ్‌నగర్‌లోని ఒక ఫార్మా కంపనీ యాజమాన్యం యూనియన్ పెట్టుకోనివ్వడం లేదు. యూనియన్ పెట్టుకోవడం కార్మికుల హక్కు అని ధర్నా చేస్తున్న కార్మికులను పోలీసులు అరెస్టు చేసి ధర్నాను కొనసాగించలేదు. మెదక్ జిల్లా పెద్దమాసాంపల్లిలో ఫార్మా కంపెనీ

కోసం జరిపిన ప్రజాభిప్రాయ సేకరణ సభలో ఫార్మా కంపనీ వద్దని నినదించిన ప్రజలపై లాఠీ చార్జిచేసి భీభత్సం సృష్టించారు. కరీంనగర్, జమ్మికుంటలో విత్తనాల కోసం ఆందోళన చేస్తున్న రైతులపై, వరంగల్ మార్కెట్‌లో ప్రత్తి అమ్మే విషయంలో అన్యాయంగా వ్యవహరిస్తున్న కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియాకు నిరసనగా రైతు ధర్నా చూసినపుడు సమస్యలు పరిష్కరించకుండా పోలీసు లాఠీ చార్జిచేసి అణిచివేసారు. కరీంనగర్‌లో గ్రానైట్ కోసం వందలకొద్ది కొండలు పగులకొడుతున్నప్పుడు నిరసనపై కూడా పోలీసులు విరుచుకపడి మహిళలతో సహా చాలా మందిని అణిచివేసి కేసులు పెట్టి జైలుకు తరలించారు. ఉస్మానియా, కాకతీయ యూనివర్శిటీల్లో విద్యార్థులు, నిరుద్యోగులు ఏ సమస్యపై స్పందించినా పోలీసులకు పనిచెప్తున్నారు. తెలంగాణ ఆవిర్భవించిన తరువాత యూనివర్శిటీలలో, కళాశాలల్లో సమస్యలు ఉత్పన్నమైనపుడు ఎట్లా పరిష్కరించుకోవాలో అందుకు సంబంధించిన పాలనాపరమైన విధివిధానాలు ఇప్పటికే ఏర్పరుచుకోవాల్సివుండే. కాని ఆ దిశగా యూనివర్శిటీ మేధావులు ఆలోచించడంలేదు.

భద్రాది పవర్‌ప్లాంటు, యాదాద్రి పవర్‌ప్లాంటు, దామెరచెర్ల పవర్‌ప్లాంటు ఏర్పాటు విషయంలో నిబంధనల ప్రకారంగా “కాలుష్యనియంత్ర మండలి” నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ పోలీసుల పహారాతోనే కొనసాగాయి. నిర్భయంగా చెప్పనివ్వలేదు. ఆధార్‌కార్డు వున్నవారినే అనుమతించారు. అన్నిచోట్ల పర్యావరణ వేత్తలను, మానవ హక్కుల కార్యకర్తలను అనుమతించలేదు. అనుమతించిన చోట వారి వారి ఫోటోలు తీసుకున్నారు. భద్రాద్రి పవర్‌ప్లాంటు కోసం ప్రజాభిప్రాయ సేకరణ రోజు ఖమ్మం, భద్రాచలంలో మానవ హక్కుల సంస్థ కార్యకర్తలను “హౌజ్ అరెస్టు” చేసి బయటికి రానివ్వలేదు. భద్రాచలం డివిజన్‌లో బైడోవర్ పేరుతో ప్రతినెల ఆదివాసీలను పోలీస్ స్టేషన్‌కు పిలచి రోజంతా కూర్చొబెట్టి సంతకం చేయించుకొని, ఒక కాగితంపై మళ్ళీ ఎప్పుడు రావాలో, వాళ్ల గూడెం నుండి ఇంకా ఎవరిని తీసుకురావాలో రాసియిస్తారు. గత ప్రభుత్వం హయాంలో మొదలైన ఈ చట్ట వ్యతిరేకమైన కార్యక్రమం ఆదివాసీలపై ఇంకా కొనసాగుతూనే వున్నది. గత నెలలో శ్రీరామనవమికి హాజరు చేయడానికి గవర్నర్ భద్రాచలం వెళ్ళినపుడు సొందు వీరయ్య అనే ఆదివాసీ కార్యకర్తను పోలీస్‌స్టేషన్‌లో కూర్చొబెట్టారు. భద్రాచలం డివిజన్‌లో సంభవించిన పిల్లల మరణాలపై ఆయనొక నివేదిక తయారుచేసాడు. గవర్నర్‌ను కలిసి ఆయనకు సమర్పిస్తానని ఒక విలేకరితో అన్నాడట. అంటే ఆయనను దినమంతా నిర్భందించి పెట్టారు.

పైన ఉదహరించిన సంఘటనలన్నీ కూడా ఏ నక్సలైట్లకో, తీవ్రవాద కార్య క్రమాలకో సంబంధించినవి కావు. అన్నీ మామూలు నిరసనలు, ప్రభుత్వానికి ప్రజాభిప్రాయాలు తెలిపే కార్యక్రమాలు. ప్రజల సమస్యల్ని పోలీసులు చేతిలో పెట్టకుండా, పాలనాపరమైన అంశంగా భావించి, వాటిని ఎట్లా పరిష్కారించాలో, ఆ ప్రజలతో ఏ విధంగా చర్చ పెట్టుకోవాలో అనే విధానపరమైన, పాలనాపరమైన ఫ్రేమ్‌వర్క్ ఒకటి ప్రభుత్వం ఇప్పటికే తయారుచేసుకోవలసి ఉండె. అటువంటి విధి విధానాలు అమలులో ఉంటే, అన్ని సమస్యలను పోలీసులకు అప్పచెప్పే అవసరం ఉండదు. హక్కుల ఉల్లంఘన జరుగదు.

స్నేహపూరిత పోలీసు వ్యవస్థ ఏర్పాటుకు పోలీసు శాఖను సంస్కరించడానికి తెలంగాణ ప్రభుత్వం పూనుకోవడం అభినందనీయమే. పోలీస్ బడ్జెట్ పెంచడం, ప్రతి స్టేషన్‌కు నిధులు మంజూరు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులో ఉంచడంలాంటివి చేయవలసిందే. దీని వల్ల హైదరాబాద్ నగరంలో కొంచెం మార్పు కనబడుతుంది. కాని మండల స్థాయిలో, గ్రామ స్థాయిలో పరిస్థితి అట్లాగే ఉంది. ఫిర్యాదు నమోదు చేసి ఎఫ్.ఐ.ఆర్. పొందడానికి పోలీసు స్టేషన్ల చుట్టూ జనం తిరుగుతూనే ఉఆన్నరు. రూరల్ పోలీస్ స్టేషన్ కాంపౌండ్‌లో చెట్ల క్రింద డజన్ల కొద్ది బాధితులు కనిపిస్తూనే ఉ న్నారు. ఒక నిర్థిష్టమైన శిక్షాకాలానికి సంబంధించిన ముద్దాయిలనే జైలుకు పంపాలి. తక్కిన అభియాగాల విషయంలో పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ అధికారి బెయిల్ ఇవ్వవచ్చు అనే “నేర స్తృతి” సవరణ జరిగింది. దీనితో పోలీస్ స్టేషన్లలో లంచాలు ఇచ్చే వ్యవహారం పెరిగిందని హక్కుల సంఘం అధ్యయనంలో తేలింది. నేర విచారణలో ఇంకా పాత పద్దతులు, చిత్రహింసలు, థర్డ్‌డిగ్రీ పద్దతులు పాటిస్తూనే ఉన్నారు. సంచార దళిత ఉపకులాలపై విరుచుకపడి అక్రమంగా కేసులు పెట్టడం, కేసులు పెడ్తామని పోలీసులు బెదిరించి డబ్బులు, బంగారం వసూలు చేసిన సంఘటనలు చాలా మా సంస్థ పోలీసు ఉన్నతాధికార్ల దృష్టికి చేవడం జరిగింది.

ఎ.బి.ఎన్. ఛానెల్‌పై విధించిన ఆంక్షలే కాకుండా వాస్తవాలు రాసిన పత్రికా విలేకర్లపై దాడులు, కేసుల్లో ఇరికించడం లాంటి సంఘటనలు కూడా జరిగాయి. నిజామాబాద్‌లో ఒక విలేకరి స్థానిక మంత్రికి వ్యతిరేకంగా వార్త రాసినందుకు ఆయనపై దాడిచేసి, పోలీసులతో కొట్టించి కేసులు పెట్టారు. మెదక్ జిల్లాలో కూడా ఇటువంటి సంఘటనలు జరిగాయి. వరంగల్‌లో ముఖ్యమంత్రి సభలో నిలబడి తన ఇబ్బందులు చెప్పే ప్రయత్నం చేసిన రైతును పోలీసులు బలవంతంగా నోరుమూసి ఎత్తుకెల్లి బయటకు ఈడ్చుకపోయారు. అదే వ్యక్తి ఉపముఖ్యమంత్రి సభలో ప్రశ్నించడానికి ప్రయత్నిస్తే, పోలీసులు అరెస్టు చేసి తీవ్రంగా చిత్రహింసలు పెట్టి, కేసు బనాయించి జైలుకు పంపారు.

ప్రజాస్వామ్య ప్రభుత్వంలో అయిదు అంతర్భాగ అంశాలు ఉండాలి. అవి ఎల్లప్పుడు ప్రస్ఫుటంగా పనిచేస్తూ ఉండాలి. 1) వ్యక్తి స్వేచ్ఛ (Freedom) 2) స్వపరిపాలన (Self governance) 3) పౌరులకు పరిపాలనలో భాగస్వామ్యం (Empowerment) 4) చట్టం అందరికీ ప్రభుత్వంతో సహా శిరోధార్యంగా ఉం డటం (Rule of Law) 5) స్వయం పరివర్తానాశక్తి (Self correcting process) ఈ అయిదు అంశాలను ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే అంశాలుగా చూడవలసి ఉంటుంది. ఈ అంశాలన్ని కూడా అధికారంలో ఉన్న పార్టీ విలువలకు గీటురాయిగా ఉంటాయి. ఏ ప్రభుత్వంలోనైనా ప్రజలకు ప్రభుత్వానికి మధ్య ఉద్యోగస్తులు సంధాన కర్తలుగా ఉంటారు. వారు నిజాయితీతో, నిబద్ధతతో, ప్రజలపట్ల గౌరవంతో, జవాబుదారి తనంలో వాళ్ళ బాధ్యతలు నిర్వహించనప్పుడు ప్రజలకు సంక్షేమ పథకాలు అందుబాటులోకి రాక వాళ్ళ హక్కులను అనుభవించలేని పరిస్థితి ఏర్పడుతుంది. కీ.శే. ఎస్.ఆర్ శంకరన్ గారు ప్రభుత్వ ఉద్యోగులు సరిగ్గా విధులు నిర్వహించినప్పుడే ప్రజలు హక్కులను కొంత మోతాదులోనైనా అనుభవిస్తారు అని చెప్పేవాడు. తెలంగాణ పునర్నిర్మాణంలో మా వంతు పోషిస్తామన్న ఉద్యోగస్తులు ఆచరణలో చాలా అసంతృప్తిగా వ్యవహరించారు, వ్యవహరిస్తున్నారు కూడా.

ఉద్యమ సంస్థగా ఉన్న పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, తాను కేవలం ఒక పూర్తి స్థాయి రాజకీయ పార్టీగా వ్యవహరిస్తాననుకుంటుండొచ్చు. కొని ఈ పార్టీ ప్రజల హక్కులేమిలోంచి, ఆకాంక్షలలోంచి ఉద్భవించిదన్న విషయం మరువరాదు. ఆ పార్టీ ధృక్పధం ఎట్లా ఉన్నా, మనకొక రాజ్యాంగం ఉందని, అందులో ప్రజల మౌళిక హక్కుల అంశాలు పొందుపరచబడ్డాయని, ప్రభుత్వాలు నిజాయితీగా, జవాబుదారీ తనంతో వ్యవహరించాలనే జిజ్ఞాస కోల్పేతే క్షమించడానికి వీలులేదు. తెలంగాణ విద్యావంతుల వేదిక ఇతర హక్కుల సంఘాలతో గొంతు కలిపి ప్రజల హక్కుల ఉల్లంఘన విషయమై ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తే తప్ప, ఇక ముందైనా ప్రభుత్వం జాగ్రత్తగా వ్యవహరించదు.

**యస్. జీవన్‌కుమార్**

**ఉభయ రాష్ట్రాల అధ్యక్షుడు,**

**మానవ హక్కుల వేదిక**

# భూమిలేని దళిత కుటుంబాలలో మహిళకి భూమి కొనుగోలు పంపిణీ పథకం - ఏం జరుగుతోంది

తెలంగాణాలో టి.ఆర్.ఎస్. ప్రభుత్వం, ఎన్నికల వాగ్దానాలకి అనుగుణంగా భూమికొనుగోలు పథకాన్ని 2014 ఆగస్టు 15న ప్రారంభించింది. ఈ పథకంలో భూమిలేని వ్యవసాయం మీద ఆధారపడిన దళిత కుటుంబాలలోని స్త్రీలకి భూమి కొని, ఒక్కొక్కరికి మూడు ఎకరాల భూమిని పంపిణీ చేస్తారు. ఈ పథకం ఉద్దేశ్యం గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయం మీద ఆధారపడిన దళిత స్త్రీలకి వ్యవసాయ భూమిని పంపిణీ చేసే వారికి సుస్థిరమైన జీవనోపాధిని కల్పించడము, సామాజిక స్థాయిని పెంచడము, ఎస్.సి. అభివృద్ధి శాఖ జీ.వో.నెం.4 తేది 7-8-2014 ద్వారా ఈ పథకంలో మొదటి దశ కోసం 45 కోట్లను విడుదల చేసింది. ఈ పథకం అమలు కోసం గైడ్‌లైన్స్‌ని అన్ని వివరాలతోను ఈ జీ.వో. లో తెలియపరిచారు.

ఈ పథకం ప్రారంభినప్పటి నుండి 2015 ఏప్రిల్ 10 దాకా ఎంపిక చేయబడ్డ దళిత కుటుంబాలలోని 841 మంది భూమి లేని మహిళలకి 2217.37 ఎకరాల భూమి పంపిణీ చేయబడింది. ఇందులో 1955.23 ఎకరాలు ప్రైవేటు భూమి, ప్రభుత్వ భూమి 2617.37 ఎకరాలు ఎక్కువ మంది అబ్దిదారులు (238) మెదక్ జిల్లాకు చెందినవారు. వీరికి లభించిన భూమి 575.35 ఎకరాలు. తరువాత ఆదిలాబాదులో 156 మంది లబ్దిదారులు. నల్లగొండలో 139 మంది, కరీంనగర్‌లో 108 మంది లబ్దిదారులు.

మెదక్, వరంగల్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలో అనే గ్రామాలకు వెళ్ళి లబ్దిదారులైన స్త్రీలను కలిసి ఈ పథకం అమలవుతున్న తీరుని పరిశీలించి, స్త్రీల అనుభవాలను తెలుసుకోవడం జరిగింది. అన్ని గ్రామాలలోను ఈ స్కీము ద్వార భూమి పొందిన స్త్రీలతో బృంద చర్చలు జరిపాము. కొనుగోలు చేసి పంపిణీ చేసిన భూములను కూడా చూడటం జరిగింది.

ఈ సందర్భన చర్చలతో పరిశీలించిన విషయాల సారాంశాన్ని కింద పొందుపరిచాము.

**1. భూములు కొనే కార్యక్రమమా? పంపిణీ చేసే కార్యక్రమమా?**

మొట్ట మొదట స్ఫురించే ప్రశ్న ఇది భూమి పంపిణీ కార్యక్రమమా లేక ఆ పేరుతో భూముల్ని కొనే కార్యక్రమమా. ఇంతకు ముందు ఎస్.సి. కార్పోరేషన్ కానీ, ఐ.కె.పి. - సెర్ప్ కార్యక్రమాల్లో కానీ భూమిని కొని భూమిలేని కుటుంబాలకి పూర్తి హక్కులతో ఇవ్వడం జరిగేది. ఇప్పుడు ఈ కొత్త స్కీము కింద భూములు కొని అసైన్‌మెంట్ భూములుగా, ఆ షరతులన్నీ వర్తించేటట్టుగా ఇవ్వడం జరుగుతోంది. అసైన్‌మెంట్‌కి సంబంధించి ఒక ముఖ్యమైన షరతు ఆ భూములను ప్రభుత్వం ఏ విధమైన నష్టపరిహారము ఇవ్వకుండా వెనక్కి తీసుకోవచ్చు. రెవెన్యూ డిపార్టుమెంట్ ఈ షరతుకి సంబంధించి ఒక కొత్త జీ.వో.ని నెం.601 తేది 16-12-2013న తీసుకువచ్చింది. ఇంతకు ముందు అసైన్‌మెంట్ షరతు నెం. పదిని తొలగించి ఆ స్థానంలో కొత్త నిబంధనని ప్రవేశ పెట్టింది. డాఫామ్ పట్టా దారులు తమ భూమిని ప్రజా ప్రయోజనాల కోసం వదులుకోవాల్సి వచ్చినపుడు ఆ పట్టాదారుకి ఇతర పట్టాదారులు తమ భూమిని ప్రజా ప్రయోజనాల కోసం వదులుకోవాల్సి వచ్చినప్పుడు ఆ పట్టాదారుకి ఇతర పట్టాదారులతో సమానంగా నష్టపరిహారం చెల్లిస్తుంది అనేది కొత్త నిబంధన. కొత్త జీ.వో. అమలులోకి వచ్చిన తరువాత కూడా ఈ కొత్త స్కీము కింద ఇచ్చిన పట్టాలలో పాత నిబంధనే అచ్చువేయబడి వున్నది. ప్రభుత్వం సాధ్యమైనంత తొందరగా ఈ నిబంధనని సవరించి, కొత్త నిబంధనని పట్టాలలో సొందుపరచాలి. కోనేరు రంగారావు భూములని కోల్పోవడం జరిగిందని తెలియజేశారు. కోనేరు రంగారావు కమిటి 2004లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ హోయంలో భూమి సమస్యలని అధ్యయనం చేయడానికి నియమించడం జరిగింది. ఎస్.సి., ఎస్.టి. వర్గాలు భూముల్ని కోల్పోతున్న ఈ సమయంలో దళిత మహిళలకు ఇచ్చిన భూములకు రక్షణ కల్పించడం అవసరం. అన్నివిధాల పరాయీకరణ, ఇష్టంలేని బదిలీలు, ప్రభుత్వం వెనక్కి తీసుకోవడము లాంటి విషయాల నుంచి రక్షణ కల్పించాలి.

**2. లబ్దిదారుల ఎంపిక:**

ఈ స్కీములో మొదటి విడతలో పూర్తిగా భూమి లేని స్త్రీలకి ప్రాధాన్యతని ఇస్తారు. తరువాత అర ఎకరా, ఎకరా, రెండు ఎకరాల భూమి వున్న దళిత కుటుంబాలకి, ముడు ఎకరాలు అయ్యేందుకుకు అవసరమైన భూమిని కొని ఇస్తారు. అబ్దిదారుల ఎంపికలోని అనే సమస్యలు పరిశీలలోకి వచ్చినయ్యి. ఉదాహరణకి మెదక్ జిల్లాలో జగదేశ్‌పూర్‌లో మండలంలో తీగోలు గ్రామంలో అందరి ఎస్సీల భూమి వివరాలు సీకరించారు. ఈ సర్వేలో మొత్తం 18 కుటుంబాలు ఈ స్కీముకి అర్హులుగా గుర్తించారు. అందులో అయిదు కుటుంబాలు అసలే భూమిలేనివి. మిగిలిన 13 కుటుంబాలకి 20 గుంటల నుంచి 2

ఎకరాల దాకా భూమి వున్నది. సర్వే పూర్తయిన తరువాత ఒక బహిరంగ సమావేశంలో రెవెన్యూ అధికారులు ఈ 18 కుటుంబాల పేర్లు ప్రకటించారు. ఆ కుటుంబాల వారందరు మొదటి విడదలోనే తాము లబ్ధి పొందుతామని భావించారు. కానీ పూర్తిగా భూమిలేని అయిదు కుటుంబాలనే మొదటి విడత లబ్ధిదారులుగా గుర్తించారు. ఈ చర్య మిగిలిన కుటుంబాల వారిని అసంతృప్తి పరిచింది. గందరగోళంలో పడవేసింది. గ్రామంలో ఈ విషయం మీద చర్చ జరిగినప్పుడు రెవెన్యూశాఖ వారు లబ్ధిదారులను ఎంపికచేసిన విధానం పారదర్శకంగా లేదనీ, ఏ ప్రాతిపదిక మీద వారిని ఎంపిక చేశారో తెలయదనీ, గ్రామస్థులు భావిస్తున్నారని తెలిసింది. బహిరంగంగా 18 కుటుంబాల పేర్లు ప్రకటించాక పట్వారి, వి.ఆర్.ఓ., ఎమ్.ఆర్.ఓ. కలిసి ఈ అయిదు మంది పేర్లు ఏ విధమైన కారణాలు చూపించకుండానే ఎంపిక చేశారు అని కొందరు దళిత కుటుంబ స్త్రీలు ఆరోపించారు. తరువాతయినా అమకి భూమి దొరుకుతుందని మిగిలిన కుటుంబాల వారు ఆశగా వున్నారు. భూమి దొరికిన అయిదు కుటుంబాల వారు ఎన్నో సంవత్సరాలు వ్యవసాయ కూలీలుగా పనిచేసిన తరువాత తాము భూమి సొంతదారులమయ్యామని ఆనందాన్ని వ్యక్తపరిచారు. వరంగల్ జిల్లా, నర్సంపేట మండలంలో బానోజీ పేట గ్రామంలో 36 భూమిలేని దళిత కుటుంబాలు చాలా సంవత్సరాలుగా 46 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నాయి. ఈ భూములని సీలింగ్ భూములుగా ప్రభుత్వం చాలా సంవత్సరాల క్రితమే స్వాధీన పరుచుకుంది. కానీ ఈ భూములు పాత సొంతదారులు ఆయిన పింగళి రంగారావు స్వాధీనంలోనే వున్నాయి. సింగళి రంగారావు ఈ భుముల గురించి కోర్టులో కేసు పెట్టాడు. అది నడుస్తున్నది. రెవెన్యే అధికారులు ఈ స్కీము కింద పంపిణీ చేయడానికి ఈ భుములను కొనడానికి ఎంపిక చేశారు. ఈ భూములను నలుగురు బానోజీపేటకు చెందిన లబ్ధిదారులకి మరో ముగ్గురు పొరుగున వున్న చాంద్రాయనపల్లి గ్రామానికి చెందిన వారికి పంపిణి చేయాలని నిర్ణయించారు. వీరందరు భూమి లేని కటుంబాలకు చెందిన వారే. ఈ ఏడుగురు లబ్ధిదారులకి మూడు ఎకరాల చొప్పున పట్టాదారు పాసు పుస్తకాలు కూడా ఇచ్చేశారు. రెవెన్యూశాఖ వారు. ఈ భూమి ఇప్పటికే వివాదంలో వున్నది. కోర్టులో కేసు నడుస్తున్నది. భూమిలేని దళిత కుటుంబాల వారు దీనిని సాగు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితిలో రెవెన్యూశాఖ వారు తొదరపడి ఈ భూములను వేరే వాళ్ళకి అసైన్ చేయడం గ్రామంలో తీవ్రమైన ఘర్షణ వాతావరణాన్ని సృష్టించింది. ఇప్పటికే సాగు చేసుకుంటున్న దళిత కుటుంబాల వారు, ఆ భూమి మీద తమ హక్కుని గుర్తించక పోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరిస్తున్నారు. గ్రామంలో జరిగిన చర్చలలో యం.ఆర్.ఓ., ఆర్.డీ.వో. సర్పంచి కలిసి ఎంపికయిన ఏడుగురు లబ్ధిదారులు ఒక్కొక్క ఎకరానికే అంగీకరిస్తున్నట్టుగా ఒప్పందం మీద సంతకం చేయించుకున్నారని తెలిసింది. ఇంతకు ముందు 3 ఎకరాలుగా ఇచ్చిన పాస్ బుక్‌లను ఇప్పుడు ఒక ఎకరంగా మార్చాలి. గత 20 సంవత్సరాలుగా ఈ భూమిని సాగు చేసుకుంటునప్న 36 కటుంబాలు ఆ భూములను చిన్న భాగాలుగా అయినా తమకే ఇవ్వాలని డిమాండు చేస్తున్నారు. ఈ మధ్యలో రంగారావు కుటుంబం అందులో ఈ భూమి సమస్య రాజకీయ రంగులోకి మారుతోంది. ఏ సమస్యలు, డిమాండ్లు మాత్రం ఇంత వరకు పరిష్కారం కాలేదు.

**3. భూముల ఎంపిక:**

లబ్ధిదారులు ఎంపిక తరువాత సమస్య భూముల ఎంపిక, ఈ స్కీముని అమలు చేయడానికి వివరంగా రాయబడ్డ గైడ్ లైన్సులో భూమి కొనుగోలు గురించిన అంశాలు స్పష్టంగా వున్నాయి. మొత్తం స్కీములో అతి ముఖ్యమైన విషయం భూమి పట్ల లబ్ధిదారుల సంతృప్తి. ఉదాహరణకి గైడ్‌లైన్ నెం.7 ప్రకారం ఎంపిక చేసిన లబ్ధిదారులు భూమి వ్యవసాయ యోగ్యం కాదు అనుకుంటే, మిగిలిన పనినంతటినీ వెంటనే ఆపెయ్యాలి. ప్రతి లబ్ధిదారు నుంచి అంగీకరించిన ఎఫిడవిట్‌ని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తీసుకున్న తరువాతనే మిగిలిన పనులని కొనసాగించాలి. (పేజీ 4, ఛాప్టరు 2, భూమి కొలనుగోలు స్కీము - అమలు గైడ్‌లైన్సు) ఈ స్కీము కోసం భూమిని గుర్తించడంలో క్షేత్రస్థాయి అనుభవాలలో మాత్రం అనేక సమస్యలు, లోపాలు కనిపిస్తున్నాయి.

నల్లగొండ జిల్లా వలిగొండ మండలం వేములకొండ గ్రామంలో రెవెన్యూ అధికారులు ఆర్.డి.వో., యం.ఆర్.ఓ. కలిసి వి.ఆర్.ఓ. సహాయంతో ప్రతి ఇంటినీ సర్వే చేయడం ద్వారా ఈ ప్రక్రియ మొదలు పెట్టారు. మొత్తం 21 దళిత కుటుంబాలు ఈ స్కీముకి అర్హులుగా గుర్తించారు. అందులో 6 కుటుంబాలు పూర్తిగా భూమిలేని వారు మిగిలిన వారికి 2 ఎకరాల కంటే తక్కువ భూమి వున్నది. అధికారులు 18 ఎకరాల ప్రభుత్వ భూమిని 6 కుటుంబాల వారికి ఇవ్వడానికి గుర్తించారు. లబ్ధిదారులైన స్త్రీలు ఆ భూములను సలైన్ (ఉప్పరిసి పోయిన) భూములనీ, ఆ భూముల నిండా పెద్ద పెద్ద రాళు ళ్ళ తుప్పలు వున్నాయని, ఆ భూమి వ్యవసాయ యోగ్యం కాదనీ, ఆ భూమి వద్దు అన్నారు. మరొక 40 ఎకరాల భూమిని కొనాలని చూసారు కానీ అది చెరువు శిఖం భూమి. అసైన్‌మెంట్ రూల్సు ప్రకారం ఆ భూమి పంపిణీ చేయకూడదు. ఆ భూమి ఆ గ్రామంలోని మరొక రైతు ఆక్రమణలో వున్నది. ఆ గ్రామంలోని 6 దళిత స్త్రీలకి పట్టాలు అందినయ్యి. ఏ ప్రభుత్వ భూమినైతే వ్యవసాయయోగ్యం కాదని తిరస్కరించారో ఆ భూమికే ప్రభుత్వం వారికి పట్టాలు ఇచ్చింది. తమకి ఉపయోగం

లేని భూమిని ఇచ్చినందుకు ఆ దళిత మహిళలు యం.ఆర్.ఓ. ఆఫీసు ముందు ధర్నా చేసారు. ఈ విషయం ఇంకా పరిష్కరించబడలేదు.

ఈ స్కీములో భూమిని కొనడానికి ముందు భూ నాణ్యతని నిర్ణయించడానికి సరైన విధానాలు లేకపోవడం వల్ల తరచుగా నాణ్యత, ఉత్పాదకతా లేని భూములను పేదలకి బదిలీ చేయడం జరుగుతోంది. మెదక్ జిల్లా రామాయంపేట మండలం చెల్మడలో ఈ స్కీము కింద 27 ఎకరాల భూమిని కొని 9 మంది దళిత కుటుంబాలకు పంపిణీ చేస్తే అందులో 10 ఎకరాలు మాత్రమే వ్యవసాయ యోగ్యమైన భూమి. మిగిలిన 17 ఎకరాలు నాసిరకం భూములు ఎన్నో సంవత్సరాలుగా సాగులో లేని భూములు.

ఈ అనుభవాల దృష్ట్యా అధికారులు భూమి కొనుగోలు విషయంలో తొందర పాటుగా వ్యవహరించారని, లబ్ధిదారులు భాగస్వామ్యము, అంగీకారము లేకుండా కొనుగోలు జరిగిందనీ తెలుస్తోంది. లబ్ధిదారులలో అసంతృప్తికి, కొన్ని సార్లు తీవ్రమైన సామాజిక ఘర్షణకి ఈ చర్యలు దారి తీస్తున్నాయి. మెదక్ జిల్లాలో శంకరంపేట మండలంలోని, సూరారం గ్రామంలోను, కొండపాక మండలంలోని, బండారం గ్రామంలోను లబ్ధిదారులు ఆనందంగా వున్నారు. ఈ గ్రామస్థులతో చర్చించినప్పుడు లబ్ధిదారుల ఎంపిక, భూముల ఎంపికా కూడా లబ్ధిదారుల భాగస్వామ్యంతో, గైడ్‌లైన్స్‌కి లనుగుణంగా జరిగిందని తెలిసింది.

**4. భూమి సంబంధిత పత్రాలు పొందటం:**

క్షేత్రస్థాయి పరిశీలనలో లబ్ధిదారులకి భూమి పంపిణీ జరిగినా కూడా పట్టాదారులు పాసుపుస్తకాలు, వారి పేరు మీద భూమి మార్చడం లాంటివి ఇంకా జరగలేదు. ఉదాహరణకి రంగారెడ్డి జిల్లాలో దోమా మండలంలోని, గూడూరు గ్రామంలో 9 ఎకరాల భూమిని కొని ముగ్గురు భూమిలేని దళిత మహిళా లబ్ధిదారులకి అసైన్ చేశారు. వారికి పట్టాదారు పాసు పుస్తకాలు కానీ టైటిల్ డీడ్స్ కాని ఇవ్వలేదు. పంపిణీ చేసిన ఈ భూములు సారవంతమైన నల్లమట్టి గల భూములైనా కూడా ఈ భుములకి సాగునీటి సౌకర్యం లేదు. సరియైన పట్టా కాగితాలు లేకపోవడం వల్ల మహిళా లబ్ధిదారులు బ్యాంకు రుణాలు కానీ విస్తరణ సేవలు, ఇతర సహాయ సేవలు లభించకపోవడం వల్ల ఆ భూములలో వారు వ్యవసాయం చేసుకోలేక పోతున్నారు.

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామంలో ఈ స్కీము కింద 17 ఎకరాల భూమికొని 6 లబ్ధిదారులకి పంపిణీ చేయడం జరిగింది. ఈ లబ్ధిదారులందరిని మొదటి విడత లబ్ధిదారులుగా 2014 ఆగస్టులోనే ఎంపిక చేసినా భూముల పంపిణీ మాత్రం 2015 ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి నాడే జరిగింది. ఈ భూమికి సాగునీటి సౌకర్యం లేకపోవడం వల్ల లబ్ధిదారులు వ్యవసాయం మొదలుపెట్టలేకపోతున్నారు. ఈ భూములకి రెండు బోరుబావులు మంజూరైనా కూడా, పని ఇంకా ప్రారంభం కాలేదు. భూమికి సంబంధించిన పత్రాలను లబ్ధిదారులకి ఇవ్వకపోవడానికి కారణం, స్థానిక ఎమ్.ఎల్.ఎ. తానే ఇవ్వాలని అనుకోవడమే.

**5. భూమి ధరల నిర్ణయం:**

క్షేత్రస్థాయి పరిశీలనలో బైటకి వచ్చిన మరొక విషయం ఈ స్కీము కింద కొన్న భూముల ధరల బేరాలు, నిర్ణయాలు ఈ టీమ్ చూసిన చాలా గ్రామాలలో భూమి ధరల బేరాలలో కాని, ధర నిర్ణయంలో కాని లబ్ధిదారులకి ఎటువంటి పాత్ర లేదని తెలిసింది. అధ్యయనం చేసిన దాదాపు అన్ని గ్రామాలలోను ధరల నిర్ణయం రెవెన్యూ అధికారులు, సర్పంచి, వి.ఆర్.ఓ.లు కలిసి చేసారని తెలిసింది. గైడ్‌లైన్స్‌లో భూమి ధర నిర్ణయం గురించి పట్టాదారుతో భూమి ధర గురించి చర్చించి ఎంపిక చేయబడ్డ లబ్ధిదారుల సమక్షంలోనే జరగాలి. పారదర్శకంగా టైము, తేదీ, చోటు వివరాలను అమ్మే పట్టాదారుకి, లబ్ధిదారులకి తెలియచేయాలి. జాయంట్ కలెక్టరు పెద్దగా వున్న జిల్లా స్థాయి కమిటీ ధరను నిర్ణయిస్తారు. (పేజీ 6, ఛాప్టరు 3, భూమి కొనుగోలు పథకము – అమలు గైడ్‌లైన్సు).

క్షేత్రస్థాయి పరిశీనలో లబ్ధిదారులు ధరలు నిర్ణయంలో చురుకుగా పాల్గొనకపోతే, అమ్మే వాళ్ళు రెవెన్యూ అధికారులు కుమ్మక్కయ్యే అవకాశము స్కీములో అవినీతి చోటు చేసుకునే అవకాశము వున్నదని అర్థమయింది. ఉదాహరణకి మెదక్ జిల్లా, జగదేవ్‌పూర్ మండలంలోని తీగోలు గ్రామంలో మొత్తం 14.38 ఎకరాల భూమి ఈ స్కీము కింద ఎకరా 5.90 లక్షల రూపాయలకి కొనుగోలు చేయబడింది. చర్చలలో బైటపడిన విషయం ఆ భూమి గజ్వేల్ మండలంలోని ఒక రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌ది. ఆ ఇన్స్‌పెక్టర్ ఆ భూమిని ఎప్పుడో కొన్నారు. కానీ ఎప్పుడూ వ్యవసాయం చేయలేదు. ఈ స్కీము కింద భూమి 2 నుండి 7 లక్షల దాకా పెట్టి కొనవచ్చు. అమ్మిన వ్యక్తి రెవెన్యూ శాఖ ఉద్యోగి కావడం వల్ల ప్రత్యేకమైన ప్రయోజనం

పొందగలిగి తన భూమికి సాధ్యమైనంత ఎక్కువ ధర రాబట్టుకోగలిగారు. ఈ భూమి మొత్తం ఒకే రకమైన భూమికి ఒకే రకం ధరని పొందగలిగారు. లబ్ధిదారులైన స్త్రీలు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ భూమిలోని తుప్పలు, పొదలు కొట్టి బాగు చేసుకుంటున్నారు. ఈ సంవత్సరమే వ్యవసాయం మొదలు పెట్టవచ్చు అనే ఆశతో.

ఇలాంటిదరే ఇంకో ఉదాహరణ వరంగల్ జిల్లా శాయంపేట మండలంలోని కాట్రపల్లి గ్రామంలో జరిగిందని వార్తా పత్రికలో రిపోర్టు అయింది. ఈ గ్రామంలో 12 మంది రైతుల దగ్గరి నుండి దాదాపు 70 ఎకరాల భూమి ఎకరం 6 నుంచి 7 లక్షలకి ఈ ఎల్.పి.ఎస్. స్కీము కింద కొనడం జరిగింది. వి.ఆర్.వో., ఎస్.సి. కార్పోరేషన్ ఉద్యోగి కలిసి అమ్మకందార్లతో ఒక ఒప్పందం చేసుకున్నారు. ఈ ల్యాండ్ పర్చేజి స్కీము కింద భూమి కొనడానికి ఎకరానికి 25వేల కమీషన్ కింద చెల్లించాలనేది ఆ ఒప్పందం. కొందరు అమ్మకం దార్ల నుంచి ఈ కమీషన్ తీసుకున్నాక, తెలివినపడ్డ మరికొందరు అమ్మకందార్లు అవినీతి నిరోధకశాఖ డి.ఎస్.పి.కి ఫిర్యాదు చేశారు. రెవెన్యూ డిపార్టుమెంటు ఉద్యోగులు, ఎస్.సి. కార్పోరేషన్ ఉద్యోగులు అమ్మకందారు నుంచి కమీషన్ తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. (నమస్తే తెలంగాణ, 2015, ఏప్రిల్ 19)

**6. రెక్కలొచ్చిన భూముల ధరలు:**

భూముల కొనుగోలులోకి ప్రభుత్వం ప్రవేశించడంతో ఈ స్కీము (ఎల్.సి.ఎస్.)కి ఎంపిక కాబడ్డ గ్రామాలలోను, చుట్టు ప్రక్కల గ్రామాలలోను కూడా భూముల ధరలు పెరిగి పోయాయి. రెండవ విడత భూమి కొనుగోలుకి ఈ ధరలు సవాలుగా మారుతుంది. మెదక్ జిలల్లా బందారం గ్రామంలో ఇది వరకు 4-6 లక్షలు ఖరీదు గల భూమి ధర ఇప్పుడు ఎనిమిది లక్షలు ఆపైన చెప్తున్నారు. ఈ ధరల పెరుగుదల ఈ స్కీము కొనసాగింపుకి అడ్డంకిగా మారడమే కాక, భూములు సొంతంగా కొనుక్కోవాలనుకున్న రైతులకీ కౌలుకి భూమి తీసుకోవలకుంటున్న రైతులకీ ప్రతికూలంగా మారుతుంది.

**7. వ్యవసాయానికి మద్దతు:**

లబ్ధిదారులయిన మహిళలో చాలా మంది మొదటితరం రైతులు వారికి వ్యవసాయం కోసం దీర్ఘకాలం మద్దతుని ఇవ్వవలసిన అవసరం వున్నది. చాలా గ్రామాలలో భూమిని చదును చేయడానికి, పొదలు, మొక్కలు తొలిగించడానికి కూడా ఈ మహిళా రైతులకి సహాయం అవసరం.విత్తనాలు, ఎరువులు, ఇతర అవస రాలకి రుణాలు, పండిన పంటను అమ్ముకోవడంలోను వీరికి మద్దతునివ్వాలి. వ్యవ సాయశాఖ నుంచి ఎటువంటి సలహాలు లేకపోవడం వల్ల చాలా గ్రామాల్లో లబ్ధిదారు లు ఈ భూములలో పత్తిని పండించాలని ఆలోచిస్తున్నారు. ఈ మహిళా రైతులకి అవసరమైన సేవలు, సహకారము అందించడానికి వ్యవసాయశాఖ ముందుకి రావాలి.

**పై అనుభవాల ఆధారంగా అమలు చేయాల్సిన కొన్ని సిఫారసులు:**

1) పేద ప్రజలకు భూమిని పంపిణీ చేయడం కూడా ప్రజా ప్రయోజనమేనని ప్రభుత్వం గుర్తించాలి. మరో ప్రజా ప్రయోజనం కోసం పేదలకి ఇచ్చిన భూములను ఏ విధమైన నష్టపరిహారము చెల్లించకుండా వెనక్కి తీసుకోవడం ప్రజా ప్రయోజనం ప్రయోజనాన్నే దెబ్బతీస్తుంది. మరే ప్రయోజనం కోసము ఈ భూములను వెనకకి తీసుకోకుండా వుండే విధంగా ఒక నిబంధనని రూపొందించాలి. తప్పనిసరయిన పరిస్థితులలో ఈ భూములను ప్రభుత్వం స్వాధీన పరుచుకుంటే తగిన విధంగా నష్టపరిహారం చెల్లించాలి. ఇందుకోసం జీ.వో.యం.ఎస్.601 లోని నిబంధనలని సవరించాలి.

2) పేదలకు భూమి పంపిణీ కోసం భూమిని కొనడం అనే (ఎల్.పి.ఎస్.) ఈ స్కీములో అడ్డంకులు వున్నాయని ప్రధానంగా మార్కెట్ మీద ఆధారపడి భూ సంస్కరణలు సాధిపంచలేమనీ అనేక గ్రామాల అనుశబాలను అధ్యయనం చేయడం అర్థం అవుతుంది. గ్రామీణ ప్రాంతాలలోని తొమ్మిది అక్షల దళిత కుటుంబాలలో కేవలం మూడు లక్షల కుటుంబాలకి మాత్రమే భూమి వున్నది. భూమి కొనే పథకం (ఎల్.పి.ఎస్.) ద్వారా మాత్రమే దళితులందరికీ భూ వసతి ఏర్పరచగలడం అనేది సాధ్యమేనా? రెక్కలొచ్చిన భూముల ధరలతో దళితులందరికీ మూడు ఎకరాల భూమిని ప్రభుత్వం కొనగలరదా? భూమికొని పంపిణీ చేయడమనే స్కీము, పద్ధతి భూ సంస్కరణలతోను, వ్యవసాయ సంస్కరణలలోను ఒక భాగంగా గుర్తించాలనీ ఇక్కడ చెకప్పదలచాము. వ్యవసాయ సంక్షోభాన్ని, భూమిలేని తనాన్ని పరిష్కరించడానికి దీర్ఘకాలిక చర్యలను ప్రభుత్వాలు చేపట్టాలి.

3) ఈ స్కీము కింద భూములు అమ్మిన వాళ్ళ నేపథ్యాన్ని పొందిన వాళ్లు నేపథ్యాన్ని పరిశీలిస్తే భూ యాజమాన్యంలో వున్న అసమానతల స్పష్టంగా తెలుస్తాయి. భూములు అమ్మిన వాళ్ళలో ఎక్కువ మంది వ్యవసాయం చేయని భూకామందులు, రాజకీయంగా పలుకుబడి కలవారు. ఇతర అదాయ మార్గాలు వున్నవారు. వ్యవసాయ ఆదాయం మీద ఆధారపడిన వాళ్ళే.

ప్రభుత్వం భూముల మార్కెట్ విషయంలో నియంత్రణలు తేవాలి. వ్యవసాయం చేయని, ఇతర ఆదాయ మార్గాలున్న వారు వ్యవసాయ భూములు కలిగి వుండటాన్ని నిరోధిస్తూ తగిన చట్టాలను రూపొందించాలి. గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల పద్ధతిలో చట్టాలను రూపొందించాలి.

4) ఈ స్కీములో సరిదిద్దుకోవాల్సిన మరికొన్ని విషయాలు లబ్దిదారులు ఎంపిక ప్రమాణాలు, పద్దతీ పారదర్శకంగా వుండాలి. వ్యవసాయ యోగ్యమైన భూములను మాత్రమే ఎంపిక చేయాలనేది తప్పనిసరి.

5) భూములు దీర్ఘకాలం జీవనాధారంగా వుపయోగించడానికి ఈ మహిళా రైతులకి అనేక రకాల సహాయాన్ని అందించాలి. వ్యవస్థాగత రుణాలు, విస్తరణ సేవలు, విత్తనాలు, ఎరువులు పురుగు మందులు, పండిన పంటను అమ్ముకోవడానికి సౌకర్యాలు అందించాలి. దళిత మహిళల ఆర్థిక సాధికారత, వారి సామాజిక స్థాయిలో మార్పు సాధించాలంటే మొత్తం వ్యవసాయానికే సరైన దిశానిర్దేశం జరగాలి. అది జరగనంత కాలం మార్పు సుదూరమైన కలగానే మిగిలిపోతుంది.

**డాక్టర్ ఎస్. సీతాలక్ష్మి**

(వాదా నా తోడో అభియాన్ వారి సౌజన్యంతో...)

# తెలంగాణాలో పరిపాలన - ఒక పరిశీలన

తెలంగాణ, భారతదేశంలోని చాలా ఇతర రాష్ట్రాలలాగా ఏర్పడింది కాదు. దశాబ్దం పైగా ప్రజలు చేసిన పోరాటానికి ఫలితంగా ఏర్పడింది. 1956లో ఆంధ్ర రాష్ట్రంలో కలిపినప్పటి నుండి ఏదో ఒక విధమైన వ్యతిరేకత వ్యక్తమవుతూనే వున్నది. ఆ పోరాటాలన్నీ అప్పటి పరిస్థితుల మీద వ్యతిరేకతే కాదు మెరుగైన జీవితం జీవనాధారాల మీద కోరిక కూడా. 1956కి ముందు ఈ ప్రాంతంలో సమ సమాజం కోసం సాయుధ పోరాటం జరిగింది. తెలంగాణా ప్రజల మనసులో సమ సమాజం మీద కోరిక చాలా బలంగా వున్నది. ఈ నేపధ్యంలో చూస్తే తెలంగాణా ఉద్యమంలో రెండు ధారలు వున్నాయి. ఒకటి భౌగోళిక తెలంగాణ కోసం పోరాడిన వాళ్ళు, రెండవది ప్రజాస్వామిక తెలంగాణవాదులు. ఈ రెండింటికీ చాలా వ్యత్యాసం వుంది. భౌగోళిక తెలంగాణ కోసం పోరాడిన వాళ్ళు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే మాత్రమే ప్రజాస్వామ్య తెలంగాణ సాధ్యమవుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తు వచ్చారు. పరిపాలనని పరీక్షించాలని అన్నా, విశ్లేషించాలన్నా ఈ నేపధ్యంలోనే జరగాలి.

ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడినంత మాత్రానే నాటకీయమైన, ఊహించని మార్పులు రాలేదు. కొత్త రాజకీయాలలో పాత పద్ధతులు, విధానాలు, సంస్థలు, విలువల కొనసాగింపు మాత్రమే జరుగుతోంది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో టి.ఆర్.ఎస్. పార్టీ గుర్తించదగిన పాత్ర పోషించింది కాబట్టే కొత్త రాష్ట్ర నిర్మాణం కోసం ప్రజలు టి.ఆర్.ఎస్.ని ఎన్నుకున్నారు. పార్టీ ఒక రకంగా ఉద్యమంలో నుంచే పుట్టినా నాయకులు, ప్రధాన నాయకుడితో సహా ప్రధాన స్రవంతి రాజకీయాల నుంచి వచ్చిన వారే, దాని మంచీ, చెడ్డా రాజకీయ సంస్కృతి వంట పట్టించుకున్న వారే. అలవాటయిన రాజకీయ నాయకుల చేతుల్లో అధికారం కొత్త ప్రకంపనాలను ఏమి సృష్టించలేదు. ఫలితంగా వచ్చే మార్పు అల్లా అధికార మార్పిడే కానీ అధికారంలో మార్పుకాదు.

ఉద్యమంలో మూడు అంశాలు ముఖ్యంగా ముందుకు వచ్చాయి. నీటి పంపకం, వనరుల పంపకం, ఉద్యోగ అవకాశాలు. నీటి పంపకంలో ముఖ్యంగా కృష్ణా నీటి పంపకం పెద్ద సవాలుగా మారింది. ఉద్యోగాల విషయం పరిష్కారం కాలేదు. రెండు రాష్ట్రాల మధ్య వనరుల పంపకం సామరస్యంగా జరిగింది. హైదరాబాదు వల్ల తెలంగాణా మిగులు బడ్జెట్‌తో మొదలైంది. ఆంధ్రప్రదేశ్ మాత్రం తీవ్ర సంక్షోభంలో వున్నది. తెలంగాణా రాష్ట్రానికి వచ్చిన ఈ వెసులు బాటు మిగులు బడ్జెట్ ప్రజల మనుసులలో వున్న ప్రాధాన్యాలకి కాక వేరే వాటికి కేటాయించడం జరిగింది. నిజానికి ఆరోగ్యం, విద్యలకి కేటాయింపు చాలా తక్కువ. కేజీ నుండి పీజీ దాకా ఉచిత విద్య అనేది సుదూరమైన కలలాగే వున్నది. 17 విశ్వవిద్యాలయాల్లో ఒక్కదానికీ వైస్ ఛాన్సలర్లు లేరు. యుద్ధ ప్రాతిపదిక మీద జరగాల్సిన ఉద్యోగ నియామకాల ఊసే లేదు. తగినంత మంది విద్యార్థులు లేరనే సాకుతో పాఠశాలలని మూసివేస్తున్నారు. ఎందుకు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు లేరు అనే విచారణే జరపడం లేదు. ఉస్మానియా జనరల్ హాస్పటల్లు లాంటి ఆసుపత్రుల పరిస్థితి ఇంతే. పాత వైభవం వస్తుంది, అనుకుంటే వున్న పరిస్థితి దిగజారుతోంది. ఆసుపత్రులు, విద్యాలయాలకి బదులుగా ప్రాధాన్యతలు కొత్త సెక్రటేరియట్ కట్టడం లాంటివి కనిపిస్తున్నాయి. ఈ కొత్త సెక్రటేరియట్ గురించి ఉద్యమ కాలంలో ఎక్కడా ప్రస్తావనే లేదు. గుళ్ళ నిర్మాణం భక్తులకి వదిలేయాల్సిన విషయం, అది ప్రభుత్వానికి ప్రాముఖ్యంగా మారింది.

మొత్తం మీద రాజకీయ పాలనా సంస్కృతికి ప్రజాస్వామ్య లక్షణాలు లేవు. మంత్రివర్గ పాలన విధానంలో అధికారం అందరూ పంచుకునే బాధ్యతగా వుండాలి. రోజువారి పాలన, నిర్ణయాలు సంబంధిత మంత్రుల చేతుల్లో వుండాలి. విధాన నిర్ణయాలు మాత్రమే ముఖ్యమంత్రి దగ్గరకి వెళ్ళాలి. మంత్రి వర్గంలోని ప్రతి మంత్రిని నమ్మి తెలంగాణా పునర్నిర్మాణం బాధ్యతని అప్పగించాలి. ఆ విధంగా జరుగుతున్నట్లు కనబడటం లేదు. అధికారం అంతా ముఖ్యమంత్రి ఆఫీసులోనే కేంద్రీకృతమైంది. ఎన్.టి.ఆర్ ప్రభుత్వంలో కూడా ఇదే విధంగా జరిగింది. ఎన్.టి.ఆర్ వారసత్వం, పూర్తిగా కొనసాగుతోంది. అతని విధానమే ఆచరించబడుతోంది. ఎన్.టి.ఆర్. ఆదర్శంగా వున్నది. ఈ విధానం వల్ల నష్టమేమిటంటే రోజు వారి పాలన కుంటుపడుతుంది. ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫైళ్ళు కుప్పబడతాయి. తెలంగాణా ఉద్యమం లాంటి ఉద్యమం ఈ రాజకీయ పాలనా సంస్కృతిని రవ్వంతయినా మార్చలేక పోయింది, అనేది స్పష్టంగా కనబడుతోంది.

పరిపాలనని అర్థం చేసుకోడానికి ప్రజలు ఎంత అసంతృప్తిగా వున్నారు అనేది చూడటం ఒక మార్గం. తీర్పు చెప్పే సమయం ఇంకా రాకపోయినా ప్రజలలో అసంతృప్తికి సంకేతాలు కనిపిస్తున్నాయి. మామూలుగా ఏ ప్రభుత్వానికైనా మొదటి రెండు సంవత్సరాలు హనీమూన్ కాలంగా టైము ఇస్తారు. ఒక ప్రభుత్వాన్ని ఎన్నుకున్నాక, ఆ ప్రభుత్వం పని చేయడానికి ప్రజలు సమయం ఇస్తారు. తెలంగాణ విషయంలో మాత్రం ఈ కాలంలోనే మూడు, నాలుగు ఉద్యమాలు వచ్చినయ్యి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 20 వేల మంది విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

సమ్మె చేసారు. ప్రభుత్వం బోలెడంత సమయం తీసుకుని ఒక కమిటీని వేసింది. ఆ కమిటీ ఏడు నెలల టైమ్ తీసుకుని చేసిన సూచనలు వెంటనే మరొక సమ్మెకి, ఆమరణ నిరాహార దీక్షకి దారి తీసినయ్యి. 30 వేల మంది అంగన్ వాడి వర్కర్లు సమ్మె చేయడానికి సిద్ధపడ్డారు. కొన్ని పెంపుదలలు ప్రకటించి ఆ సమ్మెను ఆపగలిగారు. కాంట్రాక్టు పద్ధతిని తొలగించాలని 108 సర్వీసు డ్రైవర్లు సమ్మె చేసారు. రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ కండక్టర్లు, డ్రైవర్లు సమ్మె చేసారు. ఆ సమ్మె విరమణకి సుదీర్ఘ సంప్రదింపులు అవసరమయ్యాయి. దీని వెనుకే స్థానిక సంస్థలతో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మెకి దిగారు.

పరిపాలన మొత్తం మీద ఆశాకిరణం చిన్న నీటి పారుదల శాఖ. ఫలితాలు ఇప్పుడే తెలియక పోయినా గ్రామీణ ప్రాంతాలలోని వేలాది చెరువులని బాగు చేయడమనేది సరైన దిశలో వేసిన అడుగు, మిషన్లు పెట్టి పని చేయించడం కాక మనుషులతోటి పని చేయించి వుంటే మరింత వుపయోగంగా వుండేది. భారీ నీటి పారుదల విషయంలో కూడా తీసుకున్న మార్గం ఆశావహంగా వున్నది.

తెలంగాణా ఉద్యమంలో చారిత్రాత్మకమైన పాత్ర పోషించిన విద్యార్థులు, యువజనులు ఉద్యోగాల నోటిఫికేషన్ కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్రం ఏర్పడిన సందర్భంగా జరిగిన సంబురాలలో మాత్రం ముఖ్యమంత్రి 25 వేల ఉద్యోగాలను ప్రకటించారు. అది కూడా నిరంతర నిరసనల తరువాత.

పౌర హక్కుల రంగంలో తీవ్ర నిరాశ మిగిలింది. ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక ఒక సమావేశం నిర్వహించాలని ప్రయత్నించినప్పుడు హాలు మీటింగుకి కూడా అనుమతి ఇవ్వకపోవడమే కాకే అనేక మంది యాక్టివిస్టులని, బైట నుంచి వచ్చిన వారితో సహా నిర్బంధించారు. ఈ సంఘటన పాత ప్రభుత్వాల అప్రజాస్వామిక పద్ధతులనే గుర్తు చేసింది. టివివి విద్యార్థుల నాలుగవ రాష్ట్ర స్థాయి సమావేశం జరగకుండా చేసారు. విచారకరమైన విషయం ఏమిటంటే ఈ సంస్థ ఉమ్మడి రాష్ట్రంలో తమ మొదటి మూడు రాష్ట్ర స్థాయి సమావేశాలను విజయవంతంగా జరుపుకుంది. తెలంగాణా రాష్ట్రంలో దాని మొదటిసభ జరిపేటప్పుడు నిర్బంధం ఎదుర్కొవాల్సి వచ్చింది. జనగామ దగ్గర అయిదుగురు ముస్లిమ్ యువకులని బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్ లాంటిదే ఈ ఎన్‌కౌంటర్ కూడా.

మంచి పరిపాలన ప్రజల సమస్యల పట్ల అప్రమత్తంగా వుంటుంది. సమస్యలను, సంఘటనలను నిరసనలను ముందే గుర్తిస్తుంది. వాటి పట్ల సరైన విధంగా స్పందిస్తుంది. ప్రభుత్వంలో ఏ విధమైన తొందరకానీ, సమస్యల పట్ల సానుభూతి కానీ ఎవరికి కనిపించలేదు. అత్యంత ప్రాముఖ్యత ఇవ్వాల్సిన విషయాలు ఎక్కడా కనిపించడమే లేదు. ఏ విధమైన ప్రాధాన్యత పొందటం లేదు. మొత్తంగా ప్రభుత్వ పనితీరు చూస్తే పోరాటాల ఫలితంగా ఏర్పడిన ప్రభుత్వం లాగా కనిపించడం లేదు. కొత్త రాష్ట్ర నిర్మాణానికి కావాల్సిన పరవళ్ళు తొక్కే ఉత్సాహము, నిబద్ధత కనిపించడం లేదు.

**ప్రొఫెసర్ జి. హరగోపాల్**

(వాదా నా తోడో అభియాన్ వారి సౌజన్యంతో...)

# రెండెళ్ల తెలంగాణ ప్రభుత్వ పాలనలో- వైద్యం:

టిఆర్ఎస్ పార్టీ రెండెళ్ల పాలనలో వైద్యంపై విశ్లేషించే ముందు తన ఎన్నికల మెనిఫెస్టోలో వైద్యం, ఆరోగ్యం గురించి ఏం రాసుకుందో తెలుసుకుందాం...

- ప్రజా ఆరోగ్యాన్ని పరిరక్షించడం ప్రతి ప్రభుత్వం యొక్క కనీస బాధ్యత. ఈ బాధ్యతను పూర్తిగా ప్రైవేటు రంగం చేతుల్లో పెట్టి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. తెలంగాణలో ఒకప్పటి గొప్ప ఆసుపత్రులైన ఉస్మానీయా, గాంధీ, నిమ్స్ తదితర దావఖానాలు నిర్లక్షం పాలై నిర్వీర్యమవుతున్నాయి. వైద్య సహాయం కోసం దూర ప్రాంతాల నుంచి ప్రజలు హైదరాబాద్ వరక ప్రయాణించాల్సి వస్తుంది. వైద్య సహాయం అందకుండానే మార్గమద్యలో చాలా మంది చనిపోతున్నారు. తెలంగాణలో ఆసుపత్రులు ప్రజలకు అందుబాటులోకి తేవడం ద్వారా ప్రజా ఆరోగ్యాన్ని పరిరక్షించాలని ప్రభుత్వం వైద్యశాలలను మెరుగుపర్చాలని టిఆర్ఎస్ ఆశయం.
- ప్రస్తుతం తెలంగాణలో పది జిల్లాలు ఉన్నాయి. మళ్లీ 14 జిల్లాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. 24 జిల్లా కేంద్రాల్లో నిమ్స్ స్థాయిలో సూపర్ స్పెషాలిటి దావఖానాలు ఏర్పాటు చేస్తుంది. దీని వల్ల సగటునా 60 కిలో మీటర్లకు ఒక సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి అందుబాటులోకి వస్తుంది.
- అన్ని మండల కేంద్రాల్లో నలుగురు ఎంబిబిఎస్ డాక్టర్లతో 30 పడకల ఆసుపత్రులు 24 గంటలు సేవలందించేలా ఏర్పాటు చేయబడుతాయి.
- పాముకాటు, కుక్కకాటు, తేలు కాటు మందులు అందుబాటులోకి ఉంచబడుతాయి. ప్రసూతి తదితర ఆపరేషన్లు నిర్వహించడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తీర్చబడుతాయి.
- ప్రతి ఆసెంబ్లీ నియోజకవర్గంలో ఒక 100 పడకల ఏరియా ఆసుపత్రి ఏర్పాటు చేయబడును.
- తెలంగాణలోని సూపర్ స్పెషాలిటి సీట్లను ఘణనీయంగా పెంచడానికి కేంద్రంలో మాట్లాడుతుంది.
- కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ాూ××మీూ తరహా వైద్యకళాశాలను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తుంది.
- అయుర్వేద, యూనాని వైద్య పద్దతులు ప్రోత్సహించే పథకాలు అమలు చేయబడును.
- వ్యాధులు నయం చేసే పద్దతులే కాకుండా వ్యాధి కారకాలైన ఇతర పద్దతులపై సరైన అవగాహన కల్పించి వ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన పెంచుతుంది.
- విద్యార్థుల పాఠ్య ప్రణాళికల్లో ఆరోగ్య పరిరక్షణ భాగం చేస్తుంది.
- ఎంబిబిఎస్‌కు సమాంతరంగా ప్యారమెడికల్ కోర్స్‌ను ప్రవేశపెడుతుంది. కోర్సు పూర్తి చేసిన వారి సేవలు గ్రామీణ ప్రాంతాల్లో వినియోగించుకుంటుంది.

**విశ్లేషణ :**

- ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం, దేశం సుసంపన్నంగా ఉంటుంది. ఆరోగ్యమైన వ్యక్తి సమాజానికి ఒక సంపద. దేశ ఆర్థికాభివృద్ధి ప్రజల ఆరోగ్యంపైనే ఆధారపడి ఉంటుంది. సమాజం ఆరోగ్యవంతంగా ఉండాలంటే ప్రజలు కోరకు పనిచేసే నిజాయితీ గల పతిష్టమైన రాజకీయ వ్యవస్థ అవసరం. అప్పుడే ప్రజా ఆరోగ్యానికి దేశ, రాష్ట్ర బడ్జెట్‌లో సమూచిత న్యాయం జరుగుతుంది. ప్రజా ఆరోగ్యం మెరుగ్గా ఉండాలంటే రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 10శాతం వైద్య, ఆరోగ్యానికి కేటాయించాలి. కేటాయించిన బడ్జెట్‌లో ప్రతి పైసా రోగికి అందేటట్లు చూడాలి. అప్పుడే కేటాయించిన బడ్జెట్‌కు ఫలితముంటుంది. దీని కొరకు రాజకీయ వ్యవస్థ, చిత్తశుద్ధి అవసరం.
- టిఆర్ఎస్ ఎన్నికల మెనిఫెస్టోలో ప్రజా ఆరోగ్యం ప్రభుత్వాల బాధ్యత అని గత ప్రభుత్వాలు ప్రజా ఆరోగ్యాన్ని ప్రైవేటు రంగానికి అప్పజెప్పి చేతులు దులుపుకున్నాయి. ప్రభుత్వ రంగ వ్యవస్థను నిర్లక్ష్యం చేసి నిర్వీర్యం చేశాయి అని అన్నారు. వాస్తవానికి గత ప్రభుత్వాలు ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులను ప్రోత్సహించడంలో భాగంగా పెద్దఎత్తున రాయితీలు, బ్యాంకు రుణాలు కల్పించాయి. మరియు కేంద్ర రాష్ట్ర ఉద్యోగులకు ఫిజు రియంబర్స్‌మెంట్, భీమా మరియు ముఖ్యమంత్రి సహాయ నిధి పేరుతో ప్రైవేటు - కార్పొరేట్ ఆసుపత్రులకు (రంగానికి) లాభాలు చేకూర్చే బాధ్యతను తీసుకున్నాయి. దానిలో భాగంగా ప్రభుత్వ వ్యవస్థ నిర్వర్యం కావడానికి కారకాలైనాయి.

– ప్రైవేటు రంగాన్ని బలోపేతం చేయడాన్ని దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఎంచుకున్న మరో మార్గం ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యం (ప్రైవా మీణజూ)పేరుతో ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ సామాజిక భీమా పథకం – ఆరోగ్య శ్రీ మొదలైనప్పటి నుండి – 2007 నుండి 2013 సెప్టెంబర్ 21 వరకు 5579 కోట్లు ఖర్చయితే అందులో ప్రభుత్వ ఆసుపత్రులకు 1322 కోట్లు మరియు ప్రైవేటు – కార్పొరేట్ ఆసుపత్రులకు 4256 కోట్ల రూపాయలు అందాయి. ప్రవేటు రంగం ప్రభుత్వాన్ని శాసించే స్థాయికి పెరిగింది. ఇంతపెద్ద మొత్తాన్ని ప్రభుత్వ రంగంలోఖర్చుపెడితే మన రాష్ట్ర వైద్య వ్యవస్థ నిర్వీర్యం కాకుండా ఉండేది. మరియు దేశంలోనే ఉన్నతమైన వైద్య వ్యవస్థగా ఉండేది.
– అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిన ఈ రోజు వరకు టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేసే ప్రయత్నాలు చేయలేదు. తన మెనిఫెస్టోను అమలు చేసే ప్రయత్నం చేయలేదు. గత పాలకులను అనుసరిస్తూ వస్తుంది.
– ఇక మండలానికో 30 పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నియోజకవర్గానికి 100 పడకల ఏరియా ఆసుపత్రి, జిల్లా కేంద్రంలో ఒక సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి స్థాపిస్తానని తన మెనిఫెస్టోలో పేర్కొన్నట్లు తన పదవి కాలం పూర్తియ్యే సమయానికి పూర్తి చేసి అందుకు అనుగుణంగా డాక్టర్లతో పాటుగా తగిన సిబ్బందిని సరైన నిష్పత్తిలో నియమించి అవసరమైన రోగనిర్ధారణ పరికరాలు, ఇతర మౌళిక సౌకర్యాలు కల్పించే ప్రయత్నం ఈ రోజు వరకు జరగలేదు. వ్యాధులు రాకుండా ఎలాంటి నివారణ చర్యలు ఈ రెండేళ్ల కాలంలో తీసుకోకపోవడం వల్ల మలేరియా, అతిసారా, డెంగ్యు మరియు ఇతర వైరస్‌కు సంబంధించిన జ్వరాలతో ప్రజలు ప్రైవేటు, కార్పోరేట్ ఆసుపత్రులను ఆశ్రయించి వేల నుండి లక్షల వరకు ఖర్చులు చేసి అప్పుల పాలయ్యారు. ఆదివాసీ గిరిజనులు మలేరియా వ్యాధితో చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ మండలంలో ప్రాణంతకమైన మలేరియా వ్యాధితో ఇంటికి ఒకరిద్దరు మంచాన పడ్డారు. ( టివీవీ–జేవీవీ క్యాంప్ నిర్వహించి)

– స్పెషాలిటి వైద్యం ప్రజలకు పరిమితంగా అందుబాటులో ఉండడం మరియు సూపర్ స్పెషాలిటి వైద్యం అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు గుండె, మెదడు, మూత్రపిండాలు, కాలయం జబ్బులకు మరియు క్యాన్సర్ వ్యాధులకు ప్రైవేటు రంగంలో వేల రూపాయలు ఖర్చు పెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తుంది.

– ఈ రోజు వరకు తెలంగాణ ప్రభుత్వ వైద్య విధానం, గత పాలకుల వైద్య విధానం రీతిలోనే కొనసాగుతుంది. రెండెళ్లు గడిచిపోయాయి. మిగిళిన మూడెళ్లలో తన మెనిఫెస్టోని అమలు చేసే దిశగా అడుగులు వేసి ప్రజలకు మెరుగైన వైద్య విధానాన్ని అందించాలి. ప్రజల ఆకాంక్షలను అమలు చేయాలి.ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలి. ప్రభుత్వ వైద్యం నిర్వీర్యం కాకుండా చూస్తానని తెలియజేసిన తన వాగ్దానాన్ని నిలుపుకోవాలి. ప్రైవేటు రంగాన్ని బలోపేతం చేసే ఆలోచనలు మానుకోవాలి. వైద్య రంగం పూర్తిగా ప్రభుత్వ రంగంలోనే ఉచితంగా కొనసాగించాలి. అప్పుడే సాధించుకున్న తెలంగాణకు అర్థం ఉంటుంది.

**డా॥ జగదీశ్,**

**రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ విద్యావంతుల వేదిక**

# రెండేళ్ళ పాలనలో విద్యారంగం: సమీక్ష:

**మ్యానిఫెస్టో:** కె.జి టు పి.జి వరకు ఉచిత నిర్బంధ విద్య.

**ప్రస్థుత పరిస్థితి:** ఇప్పటి వరకు ఎటువంటి విధివిధానాలు రూపొందించబడలేదు. నిత్యం ప్రకటనలవరకే పరిమితమవుతున్నది.

**మ్యానిఫెస్టో:** విశాలమై ప్రాంగణంలో గురుకుల పాఠశాలలు.

**ప్రస్థుత పరిస్థితి:** 2016 ఎప్రిల్, 14 అంబేద్కర్ జయంతి రోజున 150 గురుకుల పాఠశాలలు ప్రకటన జరిగింది.

**మ్యానిఫెస్టో:** నూతన యూనివర్సిటీల నిర్మాణం.

**ప్రస్థుత పరిస్థితి:** ఇప్పటికి వరకు కొత్తగా ఒక్క యూనివర్సిటీ కూడా నిర్మాణం కాలేదు. పైపెచ్చు విదేశీ యూనివర్సిటీలు తీసుకురావడానికి ఒప్పందాలు చేసుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నవి.

**మ్యానిఫెస్టో:** పాఠ్య ప్రణాళికలో తెలంగాణ భౌగోళిక చారిత్రక అంశాలు.

**ప్రస్థుత పరిస్థితి:** ఇది అనుకున్నంతగా కాకపోయిన చాలా మేరకు అమలు జరిగింది.

**మ్యానిఫెస్టో:** ఇంగ్లీష్ మీడియంలో సి.బి.ఎస్.ఇ సిలబస్ బోధన.

**ప్రస్థుత పరిస్థితి:** ఇప్పటి వరకు సి.బి.ఎస్.ఇ సిలబస్ ప్రవేశపెట్టలేదు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ఇంగ్లీష్ మీడియంలోకి మార్చుకోవడానికి గ్రామ పంచాయితీలు ఖర్చులు భరిస్తే మార్చుకోవడానికి 2016-17 విద్యాసంవత్సరానికి అనుమతించారు.

**మ్యానిఫెస్టో:** ప్రతి మండలంలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా 5 నుండి 6 గ్రామాలకు ఒకటి చొప్పున గురుకుల పాఠశాల.

**ప్రస్థుత పరిస్థితి:** ఇప్పటి వరకు ఆచరణకు నోచుకోలేదు.

**మ్యానిఫెస్టో:** ఇంటర్నెట్ సౌకర్యం, గ్రంథాలయం, ప్లె గ్రౌండ్, రన్నింగ్ ట్రాక్, ఈత కొలనుల ఏర్పాటు.

**ప్రస్థుత పరిస్థితి:** ఇప్పటి వరకు ఏ పాఠశాలలో అమలు జరుగలేదు.

**మ్యానిఫెస్టో:** ప్రతి జిల్లాకు ఒక సాంకేతిక కళాశాల.

**ప్రస్థుత పరిస్థితి:** ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. కనీస ప్రతిపాదనలు కాని, చర్చకాని లేదు.

**మ్యానిఫెస్టో:** వృత్తి విద్య కళాశాలల ఏర్పాటు.

**ప్రస్థుత పరిస్థితి:** ఇప్పటివరకు ఒక్కటి ఏర్పాటు చేయబడలేదు.

**మ్యానిఫెస్టో:** చదువు మానేసిన వారికి టి.వి. రేడియో ఆన్ లైన్ లైవ్ క్లాస్‌లు.

**ప్రస్థుత పరిస్థితి:** ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు.

**మ్యానిఫెస్టో:** ప్రతి నియోజక వర్గానికి ఒక పాలిటెక్నిక్ కళాశాల.

**ప్రస్థుత పరిస్థితి:** రెండెళ్ళలో ఒక్క కళాశాలను కూడా మంజూరు చేయలేదు.

**మ్యానిఫెస్టో:** అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యా పరిశోధన సంస్థల ఏర్పాటు.

**ప్రస్థుత పరిస్థితి:** ఇప్పటి వరకు ఎటువంటి పరిశోధన సంస్థ ఏర్పాటు జరుగలేదు. ప్రాథమిక చర్చ కూడా లేదు.

**మ్యానిఫెస్టో:** రాష్ట్రంలో మహిళ విశ్వవిద్యాలయం.

**ప్రస్థుత పరిస్థితి:** ఇప్పటి వరకు ఏర్పాటు చేయబడలేదు. ప్రాథమిక చర్చ కూడా జరుగలేదు.

**మ్యానిఫెస్టో:** హెల్త్ యూనివర్సిటి ఏర్పాటు.

**ప్రస్థుత పరిస్థితి:** వరంగల్‌లో ఏర్పాటు చేయబడింది. వి.సి నియమించబడ్డాడు. పని ప్రారంభమైంది.

**మ్యానిఫెస్టో:** వెటర్నరీ యూనివర్సిటి.

**ప్రస్థుత పరిస్థితి:** పి.వి. పేరుతో ఏర్పడింది.

**మ్యానిఫెస్టో:** హార్టికల్చర్ యూనివర్సిటి.

**ప్రస్థుత పరిస్థితి:** ప్రకటన వచ్చింది. కాని స్పష్టత లేదు.

**మ్యానిఫెస్టో:** మైనింగ్ యూనివర్సిటీ.

**ప్రస్థుత పరిస్థితి:** ఇప్పటి వరకు ఏర్పాటు చేయబడలేదు. ప్రాథమిక చర్చకూడా జరుగలేదు.

**మ్యానిఫెస్టో:** ట్రైబల్ యూనివర్సిటీ.

**ప్రస్థుత పరిస్థితి:** ఇప్పటి వరకు ప్రాథమిక చర్చలేదు.

**మ్యానిఫెస్టో:** తెలంగాణ కల్చరల్ యూనివర్సిటి

**ప్రస్థుత పరిస్థితి:** ఇప్పటివరకు ప్రాథమిక చర్చ కూడా లేదు.

**మ్యానిఫెస్టో:** ప్రైవేటు, కార్పోరేట్ విద్యా సంస్థలలో ఫీజుల క్రమబద్దీకరణ, విద్యా ప్రమాణాల పెంపుదల పర్యవేక్షణ కోసం ప్రత్యేక కమీషన్ ఏర్పాటు.

**ప్రస్థుత పరిస్థితి:** ప్రత్యేక కమీషన్ ఏర్పాటు చేయబడలేదు. ఫీజుల క్రమబద్దీకరణ జరుగలేదు. పర్యవేక్షణ టీంలను ఏర్పాటు చేయగానే పెద్ద ఎత్తున ప్రైవేటు సంస్థల నుండి నిరసన వచ్చింది. హైకోర్టు జోక్యంతో ప్రభుత్వం కొద్దిగా వెనుకకు తగ్గింది. ఈ విషయంలో ఒక్క అడుగు ముందుగు పడిందనే చెప్పవచ్చు.

**మ్యానిఫెస్టో:** విద్యావంతులు, మేధావులు, వైస్ చాన్స్‌లర్స్, ప్రొఫెసర్లు, లెక్చరర్లు, టీచర్లతో సెమినార్లు, చర్చలు నిర్వహించి విద్యావిధానం రూపొందించడం.

**ప్రస్థుత పరిస్థితి:** ఇప్పటి వరకు ఇది ఆచరణకు నోచుకోలేదు. ఏ యూనివర్సిటికి వి.సి కాని, అందులో ప్రొఫెసర్లు కాని నియామకం జరుగలేదు. చర్చలు జరుగలేదు. విద్యా విధానం రూపొందలేదు.

**మ్యానిఫెస్టో:** ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల పాత్రలను విద్యా రంగ పునర్నిర్మాణంలో భాగస్వాములను చేయడం.

**ప్రస్థుత పరిస్థితి:** ఇప్పటి వరకు ఈ పరంగా ఎటువంటి సమావేశం ఉపాధ్యాయ సంఘాల సమావేశం జరుగలేదు.

**ముగింపు:** సమైక్య పాలకులు తెలంగాణ విద్యారంగాన్ని కుట్ర పూరితంగా వెనుకబడేసారని, పాఠశాలలు, మెడికల్, ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీలు తెలంగాణలో సరిపోపోయేటన్ని స్థాపించకుండా సీమాంధ్రకు అధిక ప్రాధాన్యమిచ్చారని, పేదరికం వల్ల తెలంగాణలో విద్యా వికాసానికి విఘాతం ఏర్పడిందని, విద్యావికాసం లేని చోట సమాజ వికాసం జరగదని మానిఫెస్టోలో పేర్కొన్నారు. టి.ఆర్.ఎస్. అధికారంలోకి వచ్చాక అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించి ఇప్పుడున్న విద్యావిధానాన్ని మెరుగుపరిచి ప్రతి పేదపిల్లవాడు చదువుకునే విధంగా ఆ బాధ్యతను ప్రభుత్వమే స్వీకరించే విధంగా నూతన విద్యావిధానాన్ని అవలంబిస్తుందని ప్రకటించి రెండెండ్లు గడిచిన వనరులు లేక కునారిల్లుతున్న విద్యారంగాన్ని టి.ఆర్.ఎస్ పెద్దగా పట్టించుకున్నది ఏమిలేదు. బడ్జెట్‌లో నిధులు పెంచిందిలేదు. ధనికుడి నుండి పేద వాడి వరకు అందరు ఒకే విద్యను పొందాలని చెప్పిన మాటలు, కామన్ స్కూల్ విధానం గాలిలో దీపమే అయ్యింది.

**డా॥ ఏరుకొండ నర్సింహుడు,**

**ద్యాగల సారయ్య,**

**రాష్ట్ర కమిటి సభ్యులు, తెలంగాణ విద్యావంతుల వేదిక.**

# రెండేళ్ళ తెలంగాణ విద్యుత్ రంగం-ఒక పరిశీలన

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి రెండేళ్ళయ్యింది. ఈ రెండేళ్ళలో విద్యుత్ రంగం ఆకర్షించినంతగా మరే రంగం ప్రజలదృష్టిని ఆకర్షించ లేదు. దీనికి ప్రధాన కారణం దాదాపు కోతలేకుండా ప్రజలకు విద్యుత్ సరఫరా జరుగుతుండటమే. గతంలో తీవ్రమైన కోతఎదుర్కొన్న తెలంగాణ ప్రజలకు కోతలేని విద్యుత్తు పెద్ద రిలీఫ్. అయితే ఈ రెండేళ్ళలో ప్రభుత్వం విద్యుత్ రంగంలో తీసుకున్న అనేక కీలకమైన నిర్ణయాలపై ప్రజలకు పెద్దగా అవగాహన లేదు. ఈ రంగంలో ప్రభుత్వం తీసుకున్న అనేక కీలక నిర్ణయాలు తెలంగాణ ప్రజలపై దీర్ఘకాలిక ప్రభావం చూపెడతాయి.

**నిరంతరాయ విద్యుత్తు ఎలా సాధ్యమైంది?**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తీవ్రమైన విద్యుత్ కోతలు తప్పవని, తెలంగాణ అభివృద్ధికి ఇది ప్రతిబంధకంగా మారుతుందనీ సీమాంధ్ర నాయకులు వాదించారు. విద్యుత్ కొరతను అధిగమించడానికి కొంత కాలం పడుతుందనేది తెలంగాణ వాదులు కూడా భావించారు. తెలంగాణ ఏర్పడ్డ మొదటి ఖరీఫ్ సీజన్‌లో తీవ్రమైన విద్యుత్ కోతఎదుర్కొన్న తరువాత, మళ్ళీ విద్యుత్ కోతలేవు. నిజం చెప్పాలంటే, ఈ రెండేళ్ళలో తెలంగాణ ప్రభుత్వ ఉత్పత్తి సంస్థ జెన్‌కో సామర్థ్యం (పీ.ఎల్.ఎఫ్) గత 13 ఏళ్ళలోనే కనిష్ట స్థాయికి పడిపోయినా, ఇంత తక్కువ సమయంలో నిరంతరాయ విద్యుత్తు ఎలా సాధ్యమైంది?

**నిరంతరాయ విద్యుత్తుకు రెండు ప్రధాన కారణాలు:**

**1. భారీగా పడిపోయిన వ్యవసాయ రంగ వినియోగం:** తెలంగాణ ఏర్పడ్డ తరువాత అనేక కారణాలలో వ్యవసాయ రంగ వినియోగం భారీగా పడిపోయింది. తీవ్రమైన కరువు, భూగర్భజలాలు పడిపోవడం లాంటి అనేక కారణాలతో మొత్తం వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలోకి కూరుకు పోయింది. నీటిని ఎక్కువగా వినియోగించుకునే వరి సాగు గతంలో ఎన్నడూ లేనంతగా పడిపోయింది. 2015 ఖరీఫ్‌లో వరిసాగు సాధారణ వినియోగంతో పోలిస్తే 58 శాతానికి పడిపోయింది. అలాగే 2016 రబీలో వరిసాగు 39శాతానికి పడిపోయింది. వ్యవసాయ రంగ విద్యుత్ వినియోగం మొత్తం రాష్ట్ర విద్యుత్ వినియోగంలో 20-25% వరకూ ఉంటుంది. రబీ, ఖరీఫ్ సీజన్లలో ఈ వినియోగం 35-40% వరకూ ఉంటుంది. వ్యవసాయ రంగ వినియోగం పడిపోవడంతో, ఈ విద్యుత్తును మిగతా రంగాలకు మళ్ళించడంతో ఇతర రంగాలలో కోతలు చాలావరకు తగ్గాయి.

**2. ఏపీలో మిగులు విద్యుత్తు:** రాష్ట్రం విడిపోయిన తరువాత, ఆంధ్ర ప్రదేశ్‌లో కొత్త ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసుకోవడం, మరికొన్ని కారణాలతో ఏపీలో మిగులు విద్యుత్తు పరిస్తితులేర్పడ్డాయి. దీంతో బహిరంగ మార్కెట్లో ప్రైవేటు విద్యుత్ కంపెనీలు అమ్మే విద్యుత్తుకు ఎలాంటి డిమాండు లేకుండా పోయింది. ఈ విద్యుత్తంతా తెలంగాణకు అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర విభజనకు ముందు ఉమ్మడి ఏపీకి అందుబాటులో ఉన్న ప్రైవేటు విద్యుత్తు సుమారు 2000 మె.వా.. రాష్ట్ర విభజన తరువాత, ఏపీ నుండి ఎలాంటి పోటీ లేక పోవడంతో ఒక్క తెలంగాణకే 1800 మె.వా.వరకూ విద్యుత్తు అందుబాటులోకి వచ్చింది.

వ్యవసాయ విద్యుత్తు వినియోగం పడిపోవడం, ఏపీ నుండి మార్కెట్లో లభించే ప్రైవేటు విద్యుత్తుకు డిమాండు తగ్గిపోవడంతో తెలంగాణకు కలిసి వచ్చింది.

తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న కొన్ని ప్రధాన నిర్ణయాలు, వాటి ప్రభావం తెలంగాణపై ఎలా ఉండబోతుందో క్లుప్తంగా చూద్దాం.

**1. మణుగూరు విద్యుత్ ప్రాజెక్టు:**

తెలంగాణ ఎర్పడ్డ తరువాత త్వరిత గతిన విద్యుత్ కొరతను అధిగమించాలనే లక్ష్యంతో ఖమ్మం జిల్లాలో మణుగూరు వద్ద తెలంగాణ ప్రభుత్వం 270 మె.వా.సామర్థ్యమున్న నాలుగు యూనిట్లతో (మొత్తం 1080 మె.వా.) ఒక ప్రాజెక్టు నిర్మాణాన్ని మొదలుపెట్టింది. దీనికి భద్రాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టుగా నామకరణం చేశారు. ఈ ప్రాజెక్టుకు కావాల్సిన యంత్ర సామాగ్రి ఇప్పటికే సిద్ధంగా ఉంది. ఇండియా బుల్స్ అనే ప్రైవేటు కంపెనీకోసం బీ.హెచ్.ఈ.ఎల్ సంస్థ యంత్ర సామాగ్రిని గతంలోనే తయారు చేసింది. అయితే ఈ ప్రైవేటు ప్రాజెక్టు నిర్మాణం అనేక కారణాలతో నిలిచిపోయింది. దాంతో ఈ మెషినరీని తెలంగాణ ప్రభుత్వం తీసుకుని తక్కువ సమయంలోనే ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని భావించింది. దీనికి ఇప్పటికే దాదాపు 1000కోట్ల చెల్లింపులుకూడా జరిగాయని తెలుస్తుంది. 2016 చివరిలోగా ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందని ప్రభుత్వం తెలిపింది. కానీ ఇంతవరకూ ప్రాజెక్టు బాలారిష్టాలుకూడా దాటలేదు. పర్యావరణ అనుమతులు లేవని ఈ ప్రాజెక్టు

నిర్మాణం ప్రస్తుతానికి ఆగిపోయింది. ఈ ప్రాజెక్టు మెషినరీ సబ్‌క్రిటికల్ పరిజ్ఞానంతో తయారు చేయబడింది. సబ్‌క్రిటికల్ ప్రాజెక్టులతో వాతావరణ కాలుష్యం ఎక్కువగా ఉంటుంది. పర్యావరణ అనుమతులకు ఇది ప్రధాన ప్రతిబంధకంగా మారింది. 13 వ పంచవర్ష ప్రణాళిక నుండి, అంటే ఏప్రిల్, 2017 నుండి, సబ్‌క్రిటికల్ పరిజ్ఞానంతో నిర్మించిన ప్రాజెక్టు అనుమతించ కూడదని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకుంది.

ఈ ప్రాజెక్టు ఎలాగూ అనుకున్న సమయానికి రాదు. అదనంగా వాతావరణ కాలుష్యంతో బాటు ఇతర అనేక కారణాలతో విద్యుత్ ఉత్పత్తి వ్యయం కూడా భారీగా పెరగ బోతుంది. ఈ ప్రాజెక్టు యొక్క ఆగ్జలరీ వినియోగం (అంటే ప్రాజెక్టు నడవడానికి స్వంతంగా వినియోగించుకునే విద్యుత్తు), నిర్వహణ ఖర్చు (ఓ అండ్ ఎం), బొగ్గు వినియోగం, నీటి వినియోగం, ఆయిల్ వినియోగం మొదలైనవన్నీ సూపర్ క్రిటికల్ పరిజ్ఞానంతోనడిచే ప్రాజెక్టులతో పోలిస్తే చాలా అధికంగా ఉంటాయి. ఈ మొత్తం అదనపు భారం ఏటా సుమారు 350 నుండి 400 కోట్ల రూపాయలు ఉంటుంది. అంటే ప్రాజెక్టు ఒప్పంద కాలం 25 ఏళ్ళకు ప్రజలపై పడే అదనపు భారం సుమారు 9000 నుండి 10000 కోట్ల రూపాయలు. అదనంగా కాలుష్యాన్ని కూడా భరించాల్సి ఉంటుంది.

## 2. చత్తీస్‌ఘర్‌తో విద్యుత్ కొనుగోలు ఒప్పందం:

విద్యుత్ కొరతను త్వరిత గతిన అధిగమించాలనే కారణంతోనే తెలంగాణ ప్రభుత్వం చత్తీస్‌ఘర్ రాష్ట్రంతో 1000 మె.వా.ల కొనుగోలుకు ఒక విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీ.పీ.ఏ) చేసుకుంది. ఈ ఒప్పందం పోటీ బిడ్డింగ్ ద్వారా కాకుండా, పరస్పర అవగాహన ఒప్పందం (ఎం.ఓ.యూ) పద్ధతిలో చేసుకున్నారు.

అయితే ఈ ఒప్పందంతో అనేక సమస్యలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు ఉత్తరాదిన ఉండటంతో సరిపోయినంత సరఫరా లైన్లు లేని కారణంగా ఈ ప్రాజెక్టు నుండి విద్యుత్తు ఇప్పట్లో రాదు. వార్ధా నుండి మహేశ్వరం వరకు ప్రస్తుతం ఒక సరఫరా లైను నిర్మాణంలో ఉంది. ఇది పూర్తయిన తరువాత కానీ ఈ విద్యుత్తు తెలంగాణకు వచ్చే అవకాశం లేదు. అంటే తక్షణావసరాలను తీర్చడానికి ఈ ప్రాజెక్టు ఉపయోగ పడదు. పోటీ బిడ్డింగులో కాకుండా, ఎం.ఓ.యూ పద్ధతిలో ఒప్పందం కావడంతో ఈ ప్రాజెక్టు నుండి వచ్చే విద్యుత్తు ధర మార్కెట్ విద్యుత్ ధర కన్నా సుమారు ఒక రూపాయి వరకు అధికంగా ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం మార్కెట్ ధర యూనిట్‌కూ రూ 3.50 నుండి 4.00 వరకు ఉండగా, ఈ ప్రాజెక్టు ధర యూనిట్‌కు రూ 4.50 నుండి 5.50 వరకు ఉంటుంది. ఏటా ఈ ప్రాజెక్టు నుండి కొనే విద్యుత్తు సుమారు 700 కోట్ల యూనిట్లు ఉంటుంది, అంటే ప్రజలపై పడే అదనపు భారం ఏటా సుమారు వెయ్యి కోట్ల రూపాయలు. ఒప్పంద కాలం 12 సంవత్సరాలకు పడే మొత్తం భారం 12000 వేల కోట్ల రూపాయలు. ఇదే కాకుండా ఈ ఒప్పందంలో తెలంగాణకు హాని చేసే అంశాలు అనేకం ఉన్నాయి. వీటిని సవరించుకోకుంటే సమస్యలు తప్పవు.

## 3. యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు:

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మరో ప్రాజెక్టు యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు. దీని సామర్థ్యం 4000 మె.వా.లు. 800మె.వా ల సామర్థ్యం కలిగిన 5 యూనిట్లను నిర్మిస్తారు. ఈ ప్రాజెక్టు నల్గండ జిల్లాలోని దామెర చెర్ల వద్ద చేపడుతున్నారు. దగ్గరలో బగ్గు గనులు లేవు. కాబట్టి ఈ ప్రాజెక్టుకోసం దూర ప్రాంతాల నుండి బగ్గును సరఫరా చేయాల్సి వస్తుంది. దిగుమతి చేసిన బగ్గును కూడా ఇందులో వాడతారు. ఈ ప్రాజెక్టు నుండి వచ్చే విద్యుత్తు ధర యూనిట్‌కు 5 రూపాయల పైనే ఉంటుంది. ప్రస్తుతం ఉత్తర భారత దేశంలో మార్కెట్లో దొరికే విద్యుత్తు ధర యూనిట్‌కు రూ 3.50–4.00 వరకు ఉంది. ఈ విద్యుత్తు ఉత్తరాది నుండి సరఫరా లైన్ల నిర్మాణం పూర్తి కాగానే, అంటే సుమారు 2 సంవత్సరాల తరువాత, అందు బాటులోకి వస్తుంది. యాదాద్రి ప్రాజెక్టు నిర్మాణం కూడా పూర్తి కావడానికి కనీసం మరో మూడేళ్ళు పడుతుంది. యదాద్రి ప్రాజెక్టు పూర్తి చేసుకున్న తరువాత ఏటా ఉత్పత్తి సుమారు 3000 కోట్ల యూనిట్లు ఉంటుంది. ప్రతీ యూనిట్‌పై కనీసం ఒక రూపాయి అదనపు ఖర్చు అనుకుంటే, ప్రజలపై పడే అదనపు భారం ఏటా రూ 3000కోట్ల రూపాయలు. స్వంతంగా ప్రాజెక్టులు నిర్మించుకోవడం అవసరమే. కానీ తెలంగాణకు అనుకూలమైన, ప్రయోజనకరమైన పిట్–హెడ్ ప్లాంట్లు (పిట్–హెడ్ ప్రాజెక్టు అంటే బొగ్గు దొరికే చోటనే ప్రాజెక్టు నిర్మించడం) నిర్మిస్తే ఈ భారం ప్రజలపై పడేది కాదు. మణుగూరు ప్రాజెక్టు బొగ్గుగనులకు సమీపంలోనే ఉన్నా, ఈ ప్రాజెక్టులోని యంత్ర సామాగ్రిని కనీసం 50% విదేశీ బొగ్గు వినియోగం ఆధారంగా డిజైన్ చేయడంతో ఈ ప్రాజెక్టు ఉత్పత్తి ఖర్చు అధికంగా ఉండబోతుంది. కాబట్టి పోటీ బిడ్డింగులో ఉత్తరాది ప్రాజెక్టులతో ఒప్పందం చేసుకుని ఉంటే అనుకున్న సమయానికి విద్యుత్తు రావడంతో పాటు ఏటా వేల కోట్ల రూపాయల భారం ప్రజలపై పడకుండా ఉండేది.

### 4. పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా-ఒక పరిశీలన:

తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న మరో ప్రధాన నిర్ణయం రైతులకు పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా. ఇది ఏప్రిల్ 1, 2016 నుండి అమలు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం పగటి పూట 6 గంటలు, రాత్రి పూట 3 గంటలు సరఫరా జరుగుతున్నది. అయితే రబీ పంట పూర్తి కావస్తూ మరోవైపు వ్యవసాయ రంగ వినియోగం పూర్తిగా అడుగంటిన ఈ పరిస్థితుల్లో 9 గంటల సరఫరా పై ఇప్పుడే ఒక అంచనాకు రావడం సాధ్యం కాదు.

9 గంటల విద్యుత్తు అన్నప్పుడు, గతంలో కన్నా అధికంగా విద్యుత్తు అవసరమౌతుంది. అలాగే ప్రభుత్వంపై అదనపు భారం పడుతుంది. కానీ, ఆశ్చర్యకరంగా గతంలో 6గంటల సరఫరాకు ఎంత విద్యుత్తు సరఫరా జరిగిందో అంతే విద్యుత్తును 9 గంటలకు కూడా సరిపోతుందని చూపుతున్నారు. అదనంగా ఆర్థిక భారం కూడా పడదని విద్యుత్ సంస్థలు రెగ్యులేటరీ కమిషన్‌కు సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. వర్షాలు ఎలాగూ లేవు కాబట్టి వ్యవసాయ విద్యుత్ వినియోగం పెరగదని విద్యుత్ సంస్థలు చెబుతున్నాయి. కానీ వర్షాలు సమృద్ధిగా పడితే ఈ భారం ఎవరు, ఎలా మోస్తారు అన్న ప్రశ్నకు సమధానం లేదు.

### 5. ప్రభుత్వ ప్రణాళికలు - వాస్తవ పరిస్థితి:

2018 నాటికి రాష్ట్రంలో విద్యుత్ సామర్థ్యం 24575 మె.వా.లకు చేరుకుంటుందని ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ సామర్థ్యం 6762 మె.వా.లు మాత్రమే. అంటే అదనంగా 17813 మె.వా.ల సామర్థ్యం కేవలం నాలుగు సంవత్సరాలలో రావాలి. ఇంత అదనపు విద్యుత్తు ఇంత తక్కువ కాలంలో రాష్ట్రానికి అవసరమా అన్న విషయాన్ని కాసేపు పక్కన పెట్టి, ఇది ఎంతవరకు సాధ్యం అన్న విషయాన్ని పరిశీలిద్దాం.

ప్రస్తుతమున్న విద్యుత్ సామర్థ్యం, గత ప్రభుత్వాలకాలంలో చాలా వరకు పనులు పూర్తి చేసుకున్న భూపాలపల్లి-2వ దశ (600 మె.వా.లు), సింగరేణి-1 వ దశ (1200 మె.వా.లు) లాంటి ప్రాజెక్టులు, ప్రైవేటు రంగం నుండి వచ్చే విద్యుత్తు, సోలార్ విద్యుత్తును పక్కన పెడితే, 2018 నాటికి అదనంగా రావాల్సిన విద్యుత్ సామర్థ్యం 12880 మె.వా.లు. ప్రస్తుత పరిస్థితులలో, 2018 నాటికి 12880 మె.వా.లకు గానూ, 2000 మె.వా.ల లోపు సామర్థ్యం మాత్రం వచ్చే అవకాశం ఉంది.

### 6. కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణ ఎప్పుడు?

తెలంగాణ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించడమే కాకుండా, మొత్తం కాంట్రాక్టు కార్మికులకే ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చారు. విద్యుత్ ఉద్యోగులు చేసిన ఉద్యమంలో కాంట్రాక్టు కార్మికులు ముందు వరుసలో ఉన్నారు. సహాయ నిరాకరణ ఉద్యమం, సకల జనుల సమ్మె, సాగరహారం, చలో హైదరాబాద్, సడక్ బంద్ లాంటి అనేక కార్యక్రమాలతో పాటువిద్యుత్ ఉద్యోగులు ప్రత్యేకంగా నిర్వహించిన ధర్నాలు, మహా రక్త దాన శిబిరం, నిరసన దీక్షలు, నిరాహార దీక్షలు, సత్యాగ్రహాలువీటన్నింటిలో కాంట్రాక్టు ఉద్యోగులదే ప్రధాన పాత్ర. కాంట్రాక్టు ఉద్యోగులు లేకుండా విద్యుత్ ఉద్యమాన్ని ఊహించలేం.

ఉద్యమం సందర్భంగా పార్టీలు తెలంగాణ సమాజానికి ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాల్సిన బాధ్యత కూడా ఉంది. కాంట్రాక్టు కార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరిస్తామని అన్ని పార్టీలూ వాగ్దానం చేశాయి. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరించనున్నట్లు ప్రకటించింది. అయితె ఈ నిర్ణయం ప్రభుత్వ రంగ సంస్థలకు, ముఖ్యంగా విద్యుత్ సంస్థలకు వర్తించదని పేర్కొన్నారు. దీనికి చెప్పిన కారణం-ప్రభుత్వ నిర్ణయం కేవలం కాంట్రాక్టు కార్మికులకేగానీ, ఔట్ సోర్సింగ్ కార్మికులకు వర్తించదు. విద్యుత్ సంస్థలలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు నేరుగా సంస్థ ద్వారా నియమించబడకుండా, మధ్యవర్తి అయిన కాంట్రాక్టరు ద్వారా నియమితమవుతాడు. కాబట్టి వీరు కాంట్రాక్టు కార్మికులు కారు. అందుకని వీరికి ప్రభుత్వ నిర్ణయం వర్తించదు. ఇదీ ప్రభుత్వ వాదన.

అప్పటి వరకూ విద్యుత్ సంస్థలు కూడా తమ వద్ద పని చేస్తున్న కార్మికులను కాంట్రాక్టు కార్మికులుగానే వ్యవహరించే వారు. ఉద్యోగ నియామకాలలో కూడా ఈ కార్మికులకు వీరి సర్వీసును బట్టి వెయిటేజి ఇచ్చేవారు. ప్రభుత్వం ఎప్పుడైతే వీరిని కాంట్రాక్టు కార్మికులు కాదు కేవలం ఔట్-సోర్స్ కార్మికులు మాత్రమే అని ప్రకటించిందో, విద్యుత్ సంస్థలు కూడా అదే చెప్పడం మొదలు పెట్టారు. వీరికి ఉద్యోగనియామకాలలో ఇస్తున్న వెయిటేజిని కూడా రద్దు చేశారు.

విద్యుత్ సంస్థలలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పని, తెలంగాణ వచ్చిన తరువాత పెనం లోంచి పొయ్యి మీద పడినట్టయ్యింది. ఔట్ సోర్స్ కార్మికులు-కాంట్రాక్టు కార్మికులు కాదన్న వాదనలు విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను తీవ్రంగా

బాధించాయి. ఇప్పటి వరకూ అన్ని ఉద్యోగ నోటిఫికేషన్లలో కూడా విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఔట్‌సోర్స్ కార్మికులను కాంట్రాక్ట్ కార్మికులుగానే చూపించారు. ఒకేసారి మీరు కాంట్రాక్టు కార్మికులే కాదు మీ సర్వీసులు రెగ్యులరైజ్ కావు అన్న ప్రచారంతో కార్మికులలో ఆవేదన, ఆవేశం పెల్లుబికాయి.

నిజానికి ఏ చట్టంలో కూడా కాంట్రాక్టు కార్మికుడు-ఔట్‌సోర్స్ కార్మికుడన్న వ్యత్యాసం లేదు. ఈ పేర్లన్నీ మనం సృష్టించుకున్నవే. కాంట్రాక్టు కార్మికుల (రెగ్యులేషన్ మరియూ అబాలిషన్) చట్టం 1970, సెక్షన్ 2 (బి) లో ఇచ్చిన నిర్వచనం ప్రకారం కార్మికుడు ఏదేని సంస్థలో నేరుగా కానీ, కాంట్రాక్టరు ద్వారా కానీ పని చేస్తున్నప్పుడు, ఆ కార్మికుడు కాంట్రాక్టు కార్మికునిగానే పరిగణింపబడతాడు. కాబట్టి విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న కార్మికులందరినీ కాంట్రాక్టు కార్మికులు గానే పరిగణించాలి. దీనికి భిన్నంగా అర్థాలు చెప్పడం చట్ట విరుద్ధం అసమంజసం. ఇంకా కాంట్రాక్టు కార్మిక చట్టాల ప్రకారం, సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు శాశ్వత ప్రాతిపదికన చేసే ఏ విధులకూ కాంట్రాక్టు కార్మికులను నియమించరాదు. కాబట్టి విద్యుత్ సంస్థలలో పని చేస్తున్న అత్యధిక శాతం కార్మికులను చట్ట ప్రకారం రెగ్యులరైజ్ చేయాలి.

ఉద్యమ సమయంలో ఉద్యమ నాయకుడుగా కేసీఆర్‌తో పాటు టీఆర్ఎస్ ముఖ్య నాయకులందరూ అనేక సార్లు తెలంగాణ వస్తే కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేస్తామనీ, విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సర్వీసులను రెగ్యులరైజ్ చేస్తానని మాట ఇచ్చారు. నిజంగానే తెలంగాణ వస్తే తమ బతుకులలో వెలుగులొస్తాయని విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు నమ్మారు.

విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న కార్మికులు తమ ప్రాణాలు పణంగా పెట్టి ప్రతిరోజూ విధులను నిర్వహిస్తున్నారు. యుద్ధరంగంలో సైనికునికి యుద్ధసమయంలోనే ముప్పు ఉంటుంది. కాని విద్యుత్ కాంట్రాక్టు కార్మికునికి ప్రతిరోజూ యుద్ధమే. డ్యూటీకి వెళ్ళడమే కానీవచ్చే వరకూ ప్రాణాలకు గ్యారెంటీ లేదు. కనీస ట్రైనింగు, సదుపాయాలు లేకుండా విద్యుత్ కాంట్రాక్టు కార్మికుడు చేస్తున్న త్యాగానికి ప్రభుత్వం ఇవ్వాల్సిన కనీస ప్రతిఫలం వారి సర్వీసులను రెగ్యులరైజ్ చెయ్యడం. విద్యుత్ సంస్థలలో కాంట్రాక్టు కార్మికుల బ్రతుకులు బానిసల బ్రతుకులకన్నా హీనంగా ఉన్నాయి. వీరి జీవితాల్లో వెలుగులు నింపకపోతే, సాధించుకున్న తెలంగాణకు అర్థం లేదు.

## నిర్ణయాలలో పారదర్శకత అవసరం:

పైన చర్చించినవి తెలంగాణ ప్రభుత్వం ఈ రెండేళ్ళలో తీసుకున్న కొన్ని ప్రధాన నిర్ణయాలు మాత్రమే. ఇంకా అనేక నిర్ణయాలపై పూర్తి స్థాయిలో చర్చ జరగాలి. నిర్ణయాలన్నీ పారదర్శకంగా, ప్రజల భాగస్వామ్యంతో తీసుకోవాలి. మూడు ప్రధాన ప్రయోజనాలను ఆశించి తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్నారు. ఇవి- తెలంగాణ వనరుల దోపిడీని నిలువరించడం, యువతకు ఉద్యోగాలు, సామాజిక న్యాయం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో సీమాంధ్రకు నేరుగా వనరుల తరలింపు ఆగింది. అయితే ఈ వనరులను ఈ ప్రాంత అభివృద్ధికీ, ప్రజల సర్వతోముఖాభివృద్ధికీ దోహద పడేలా వినియోగించాలి. వనరుల వినియోగంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా, దుబారా జరిగినా, దుర్వినియోగం అయినా ఆశించిన ఫలితాలు రావు. వనరుల సక్రమ వినియోగానికి నిరంతర జాగరూకత, నిఘా, పర్యవేక్షణ అవసరం. దీర్ఘ కాల ప్రభావం చూపే నిర్ణయాలు పారదర్శకంగా జరిగితే, విలువైన సూచనలు వచ్చే అవకాశం ఉంది. ఇది తెలంగాణ సమాజానికి మంచిది. ఈ దిశగా ప్రభుత్వం పనిచేయాల్సిన అవసరం ఉంది.

**కె.రఘు**
**సమన్వయకర్త,**
**తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ**

# అంతులేని నిర్లక్ష్యానికి గురైన వ్యవసాయరంగం

రైతు స్వరాజ్య వేదిక రైతులు, రైతు సంఘాలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, యాక్టివిస్టులు, ఎన్.జి.వో ప్రతినిధులు, మానవ హక్కుల వేదికలు కలిసి ఏర్పడిన వేదిక. తెలంగాణా రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వం చేపట్టిన వ్యవసాయ కార్యక్రమాలు, వాటి అమలు తీరు, టి.ఆర్.ఎస్. పార్టీ ఎన్నికల మానిఫెస్టోలో చేసిన వాగ్దానాలను ఈ వేదిక నిశితంగా పరిశీలిస్తోంది. ఈ వేదిక మేధావులు, నిపుణులు, మహిళా రైతులు, వివిధ రాజకీయ పార్టీలకి అనుబంధంగా వున్న రైతు సంఘాలతో కలిపి రాష్ట్ర స్థాయిలో సమావేశాలు నిర్వహించింది. ఈ సమావేశాలలో పరిస్థితిని అర్థం చేసుకోవడము, సమస్యలకి తగిన పరిష్కారాలని సూచించే ప్రయత్నము జరిగింది. వరంగల్, నల్లగొండ, ఆదిలాబాదు, నిజామాబాదు జిల్లాల్లో కౌలు రైతుల గురించి ఒక సర్వే జరిపింది. అదిలాబాదు, మెదక్, వరంగల్, నల్లగొండ జిల్లాలలో జరిగిన రైతు ఆత్మహత్యల మీద నిజ నిర్ధారణ విజిట్స్ చేసింది. మెదక్ జిల్లాలో ప్రధానంగా మహిళా రైతులతో బృంద చర్చలు జరిపింది. ఈ పత్రంలో వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పనితీరును మదింపు చేయడం జరిగింది.

**ఎన్నికల మానిఫెస్టోలో టి.ఆర్.ఎస్. పార్టీ వ్యవసాయ రంగానికి చేసిన ప్రధానమైన వాగ్దానాలు:**

1. లక్ష రూపాయల దాకా రైతులందరికి రుణ మాఫీ

2. రోజుకు ఎనిమిది గంటలు ఉచిత విద్యుత్తు. మూడు సంవత్సరాలలో విద్యుత్ ఉత్పత్తిని పెంచి 24 గంటలు కరెంటు సరఫరా, పంపుసెట్ల మీద సర్ ఛార్జీలు తొలగింపు

3. ప్రతి రైతు భూమిలోను భూసార పరీక్షలు జరిపి, ఆ భూమికి అనువైన పంటల గురించి రైతులకి సూచనలు ఇవ్వడం.

4. తెలంగాణా రాష్ట్రాన్ని భారతదేశపు విత్తన భాండాగారం (సీడ్ బౌల్)గా అభివృద్ధి పరచడానికి రైతులని ప్రోత్సహించి స్థానిక భూములకి అనుగుణంగా వివిధ రకాల విత్తనాలను ఉత్పత్తి చేయడము, ఆ విత్తనాల మార్కెటింగ్ బాధ్యత పూర్తిగా ప్రభుత్వమే చేపడుతుంది.

5. సేంద్రియ వ్యవసాయం ప్రోత్సహించబడుతుంది. సాంప్రదాయ ఆహార పంటలు, చిరుధాన్యాలు పండించడానికి రైతులకి సహాయం అందించడం, ఆహార భద్రత వుండేటట్టుగా చూడటం.

6. ప్రస్తుతం వున్న కరువు నియమావళిని సమీక్షించి కొత్త విధానాన్ని రూపొందించడం ద్వారా కరువు పరిస్థితులలో తక్షణ సహాయం అందే విధానాల రూపొందించడం.

7. ఎక్కువగా రైతు ఆత్మహత్యలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడి రైతులని అధిక పెట్టుబడులు అవసరమయ్యే పంటలను పండించకుండా మళ్ళించడము. వ్యవసాయం గిట్టుబాటుగా వుండే విధంగా చర్యలు తీసుకోవడము, రైతులకి అవసరమైన సహాయాన్ని అందించడము.

8. విస్తరణ సేవలు అందుబాటులోకి తెచ్చేటందుకు వ్యవసాయ అధికారుల సంఖ్యను పెంచడము.

9. ప్రభుత్వం ఎరువులను నల్ల బజారులో అమ్మడాన్ని అరికట్టి రైతులకి సమయానికి ఎరువులు అందిస్తుంది.

10. కనీస మద్దతు ధర లభించడానికి అవసరమైన మార్కెట్‌లలో వెసులుబాటుని కల్పిస్తుంది.

11. పళ్ళ తోటల పెంపకం, కోళ్ళ పరిశ్రమ, గ్రీన్ హౌస్ వ్యవసాయానికి అవసరమైన చర్యలను చేపడుతుంది.

12. పాడి రైతులు విజయా డైరీకి పాలు అమ్మేట్లయితే లీటరుకు 4 రూపాయలు అదనంగా చెల్లిస్తుంది.

సంవత్సర కాల పాలనలో చేసిన వాగ్దానాల అమలుని సమీక్షించబోయే ముందు అసలు మానిఫెస్టోలో చేసిన వాగ్దానాలనే సమీక్షించడం అవసరం. వాగ్దానాలలో అధిక శాతం స్వాగతించదగినవే, వాటిని నిబద్ధతతో గనుక అమలు చేస్తే తెలంగాణాలో వ్యవసాయానికి కొత్త జీవం వస్తుంది. కానీ కొన్ని వాగ్దానాలు రుణమాఫీ లాంటివి తప్పుదోవ పట్టిస్తాయి. రైతులు దీనిని స్వాగతించినా అధిక సంఖ్యాక రైతులకి అన్యాయం జరుగుతుంది. మానిఫెస్టోలో ప్రస్తావించని అంశాలు కౌలు రైతులు, ఆదివాసీ, మహిళా రైతుల సమస్యలు, నిజానికి వీరే నిజమైన వ్యవసాయదారులు. వారికి వాగ్దానాలు చేయడం పక్కకి పెట్టినా కూడా మానిఫెస్టో ఈ వర్గాల వారిని అసలు గుర్తించనే లేదు.

## వ్యవసాయ రంగానికి బడ్జెట్ కేటాయింపు

తెలంగాణా రాష్ట్ర బడ్జెట్ 2015-16లకి మొత్తం 1,15,689 కోట్లు. ఇందులో వ్యవసాయ రంగానికి కేటాయింపు 8432 కోట్లు. అందులో కిందటి సంవత్సరం బడ్జెట్ లాగే ఈ సంవత్సరం 4250 కోట్లు రుణ మాఫీ పథకానికి కేటాయించారు. గ్రీన్ హౌస్ వ్యవసాయానికి 250 కోట్లు, బిందు సేద్యానికి 200 కోట్లు కేటాయించారు. పండ్ల తోటల పెంపకానికి మాత్రం కేటాయింపు నామ మాత్రంగా పెరిగింది. మార్కెటింగుకి సంబంధిత ఇతర అంశాలకీ, మౌలిక సదుపాయాల కల్పనకి కేటాయించిన మొత్తం (411 కోట్లు) అసంతృప్తి కలిగించింది. మానిఫెస్టోలో వాగ్దానం చేసినట్టుగా విస్తరణ సేవలను మెరుగు పరచడానికి వ్యవసాయ విస్తరణ అధికారుల సంఖ్య పెంచడానికి బడ్జెట్‌లో ఏ విధమైన కేటాయింపులు లేవు.

## జీ.వోలు, విధానాలు రూపొందించడం

రుణ మాఫీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొన్ని జీ.వోలను విడుదల చేసింది. కానీ వ్యవసాయానికి సంబంధించిన విధానాలు మాత్రం తయారు చేయలేదు. వ్యవసాయానికి సంబంధించి చేసిన వాగ్దానాలన్నీ ముక్కలు ముక్కలుగా వున్నాయి. సమగ్రమైన వ్యవసాయ విధానం రూపొందిచుకోక పోతే సరియైన దిశానిర్దేశం జరగదు.

## పార్టీ చేసిన వాగ్దానాలు, ప్రభుత్వ పనీతీరుని ఒకదాని తరువాత ఒకటి పరిశీలిద్దాము.

### రైతు రుణమాఫీ

జూన్‌లో టి.ఆర్.ఎస్. పార్టీ అధికారంలోకి వచ్చింది. రుణ మాఫీపై రైతులు చాలా పెద్ద ఆశ పెట్టుకున్నారు. టి.ఆర్.ఎస్‌తో సహా చాలా పార్టీలు రుణమాఫీ హామీ ఇవ్వడం వల్ల రైతులు వరుసగా రెండు సంవత్సరాలు అప్పులు కట్టలేదు. బ్యాంకులు రుణమాఫీకి ఒప్పుకోనప్పుడు అసలు సమస్య ప్రారంభం అయింది.

అప్పులు తీరుస్తున్న రైతులకి రుణమాఫీ ఒక చెడు ఉదాహరణ అవుతుంది అనేది బ్యాంకుల వాదన. టి.ఆర్.ఎస్. రిజర్వు బ్యాంకు లోను, స్థానిక బ్యాంకులలోను సంప్రదింపులు జరిపి ఒక జీ.వోను విడుదల చేసింది. (జి.వో నెం. 69, తేది: 13-8-2014). ఈ జీవో ప్రకారం రుణమాఫీ అర్హత 2014 మార్చి 31 దాకా ఇచ్చిన రుణాలు, తీర్చబడని వడ్డీతో సహా కలిపి ఒక రైతు కుటుంబానికి లక్ష రూపాయలు లేదా రుణ మొత్తం ఏది తక్కువైతే అది. ఈ జీవో రావడానికి ముందర ముఖ్యమంత్రి, బంగారం మీద వ్యవసాయం కోసం తీసుకున్న రుణాలు రుణ మాఫీ పథకం కిందకి రావు అని ప్రకటించారు. రైతులు ఈ నిర్ణయం మీద తీవ్రమైన నిరసనని ప్రకటించారు. నిరసన ప్రకటిస్తున్న రైతుల మీద లాఠీ ఛార్జీ జరిగింది. తరువాత ప్రభుత్వం బంగారం మీద రుణాలను కూడా రుణ మాఫీ పథకంలో జేర్చింది.

జీఓలో వివరించిన ప్రకారం రుణ మాఫీకి అర్హులైన రైతులను గుర్తించడానికి గ్రామస్థాయి నుంచి లిస్టు తయారు చేసి జిల్లా స్థాయి బ్యాంకర్లకి సమర్పిస్తే వాళ్ళు లబ్దిదారులని గుర్తిస్తారు.

ఈ జీవో వచ్చిన తరువాత బ్యాంకర్లని తాజాగా పంట రుణాలు ఇవ్వమని అభ్యర్థించారు. కాని అప్పటికి నెలకొని వున్న సందిగ్ధ పరిస్థితి, ఏ రైతుకి రుణ మాఫీ అర్హత వున్నది, లేనిది ప్రభుత్వ ఉత్తర్వులలో అస్పష్టత వల్ల తాజా రుణాలు విడుదల కాలేదు. ఈ లోపల ప్రభుత్వం రుణ మాఫీ అంచెలు అంచెలుగా జరగుతుందనీ, నిధుల కొరతే దానికి కారణమని, మొదటి సంవత్సరంలో 25 శాతమే రుణమాఫీ జరుగుతుందనీ ప్రకటించింది. ఈ ఆలస్యం కారణంగా 2014 ఖరీఫ్ సీజన్లో రైతులకి ఏ విధమైన బ్యాంకు రుణాలు అందలేదు. మామూలుగా అయితే ఈ రుణాలు జూన్ 15 నుంచే మొదలవుతాయి. బ్యాంకులు 25 శాతం రుణమాఫీ చేస్తే అంతే మొత్తాన్ని అక్టోబర్ నెల నుంచి అప్పులు ఇవ్వడం మొదలు పెట్టినయ్యి. దీని వల్ల రైతులు జూన్‌లో మొదలయ్యే ఖరీఫ్ సీజనుకి ప్రైవేటు వ్యక్తుల వద్ద రుణాలు తీసుకోవలసి వచ్చింది.

ఈ రుణ మాఫీ పథకానికి నిధులు ఏ విధంగా సమకూర్చుంటారు అనేది ఎలక్షన్ కమీషన్ నియమావళిని అనుసరించి ఎన్నికల మానిఫెస్టోలో వివరించలేదు. ఎక్కువ సంఖ్యలో బ్యాంకు రుణాలు తీసుకున్న వాళ్ళు పెద్ద రైతులు, వ్యవసాయ సంబంధిత కంపెనీల వారు, అందువల్ల ఈ రుణ మాఫీ పథకం వల్ల మెజారిటీ రైతులకి అన్యాయం జరుగుతుంది. ఈ పథకం వల్ల లబ్ధిపొందే చిన్న సన్నకారు రైతులు 25 శాతం కన్నా తక్కువే వుంటారు. నిజంగా వ్యవసాయం చేస్తున్న వారు పేద రైతులు, కౌలు రైతులు, వీరికి బ్యాంకు రుణాలు అందుబాటులోనే వుండవు. కాని రైతులు రుణ మాఫీ వాగ్దానానికి ఆకర్షించబడి టి.ఆర్.ఎస్.కి ఓట్లు వేసారు.

**కౌలు రైతులు**

మొత్తం రైతులలో 30 శాతం వున్న కౌలు రైతులకి బ్యాంకు రుణాలు అందుబాటులోనే లేవు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2011లో కౌలు రైతులకి బ్యాంకు రుణాలు అందుబాటులోకి వచ్చే విధంగా అధీకృత సాగుదారుల చట్టాన్ని చేసింది. 2013-14 సంవత్సరంలో తెలంగాణాలో వున్న పది లక్షలకి మించిన కౌలు రైతులలో కౌలు రైతులలో 58534 మందికి మాత్రమే ఈ చట్టం క్రింద రుణ అర్హత కార్డులు జారీ అయ్యాయి. అందులో 11806 మందికి మాత్రమే పంట రుణం లభించింది. ఆ మొత్తం కేవలం 23.92 కోట్లు మాత్రమే. అంటే పది శాతం మంది కౌలు రైతులకి మాత్రమే బ్యాంకు రుణం లభించింది. మొత్తం పంట రుణాలలో ఇది 0.001 శాతం మాత్రమే.

రైతు ఆత్మహత్యలు:

తెలంగాణ రాష్ట్రంలో అప్పులలో మునిగిపోయిన రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే వున్నాయి. వార్తాపత్రికల ప్రకారం 2014 జూన్ నుంచి 2015 మే లోపల 1000 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇంత తీవ్రమైన విషయానికి తెలంగాణ ప్రభుత్వం ఏ విధంగాను స్పందించడం లేదు. వార్తా పత్రికలు పూర్తి వివరాలతో ఆత్మహత్యల వార్తలు ప్రచురించినా, జిల్లా కలెక్టర్లు మాత్రం కేవలం 94 ఆత్మహత్యలని మాత్రమే రైతు ఆత్మహత్యలుగా గుర్తించారు. తెలంగాణాలో గత 20 సంవత్సరాలలో ఆత్మహత్యలు చేసుకున్న 27 వేల రైతుల కుటుంబాలు తీవ్రమైన సంక్షోభంలో వున్నాయి.

వ్యవసాయ విధానాల్లో పెద్ద ఎత్తున మార్పులు తీసుకురావడం ద్వారా వ్యవసాయ సంక్షోభాన్ని నివారించకుండా తెలంగాణా ప్రభుత్వం రైతుల ఆత్మహత్యల సమస్యనే గుర్తించకుండా తప్పించుకుంటున్నది. ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, అక్కడి రైతులని అధిక పెట్టుబడి పంటల నుంచి వేరే పంటలకి మారే విధంగా చేస్తామని, వ్యవసాయం గిట్టుబాటుగా మారేందుకు అవసరమైన చర్యలు చేపడతామని వాగ్దానం చేసింది టి.ఆర్.ఎస్. ఆ దిశగా ఏ చర్యలు మొదలు పెట్టలేదు.

**తెలంగాణాను విత్తన భాండాగారంగా అభివృద్ధి - మొదలే కాని కార్యక్రమం**

తెలంగాణా వివిధ రకాలైన ఆహార పంటలకి, చిరుధాన్యాలు, పప్పులు, నూనె గింజలు, కూరగాయలకి నెలవు. రైతులు వాళ్ళ సొంత విత్తనాలని వాళ్ళే తయారు చేసి దాచుకుంటారు. ఇప్పుడా వైవిధ్యం లేదు. చిరుధాన్యాలు పండించే భూముల విస్తీర్ణమూ తగ్గిపోయింది. స్థానిక పప్పులు, ధాన్యాలు, నూనె గింజలు పండించడం కూడా చాలా మటుకు తగ్గిపోయింది. రైతులు అధిక పెట్టుబడులు, ఎక్కువ నీరు అవసరమైన 3, 4 పంటలు మాత్రమే పండించే పరిస్థితికి నెట్టబడ్డారు. తెలంగాణాని విత్తన గనిగా తయారు చేస్తామనే వాగ్దానం నిలబెట్టుకోవడం చాలా అవసరం. రైతులని విత్తన కంపెనీల గుత్తాధిపత్యం నుంచి కాపాడాలి. ప్రభుత్వం మాత్రం తన వాగ్దానాన్ని పూర్తిగా మరిచిపోయింది. ఎక్కడా ఆ ప్రసక్తే లేదు. నిధుల కేటాయింపు లేదు. ఒక జీవో కానీ, పాలసీ కాని లేదు.

**మహిళా రైతులకి గుర్తింపు లేదు - సహాయము లేదు**

స్త్రీలు వ్యవసాయంలో ముఖ్యపాత్ర పోషిస్తారని అనేక అధ్యయనాల్లో వెల్లడయింది. వ్యవసాయంలో 80 శాతం పనిని రైతులుగా, కూలీలుగా స్త్రీలే చేస్తున్నారు. అయినా వారికి రైతులుగా గుర్తింపు లేదు. భూమి లేదు, భూమి పట్టాలు లేవు. టి.ఆర్.ఎస్ తన మానిఫెస్టోలో కూడా మహిళా రైతుల పాత్రను గుర్తించలేదు. అధికారంలోకి వచ్చాక పౌరసమాజ సంఘాలు స్పష్టమైన డిమాండ్లు చేసినా కూడా స్పందించలేదు. దళిత కుటుంబాలకి ఇచ్చిన మూడు ఎకరాల భూమిని స్త్రీల పేరు మీద ఇవ్వడం ఒక్కటే ఇప్పటి దాకా జరిగింది. దళిత మహిళలకు ఇచ్చిన భూమి కూడా చాలా సార్లు వ్యవసాయ యోగ్యమైన భూమి కాదు. ఈ మహిళా రైతులకి నీటి వసతి, విత్తనాలు, ఇతర సహాయం అందించలేదు.

**ఆదివాసీ ప్రాంతాల్లో వ్యవసాయం పూర్తిగా నిర్లక్ష్యం చేయబడింది.**

తెలంగాణాలో ఆదివాసులు చెప్పుకోతగిన సంఖ్యలో వున్నారు. వారి జీవనాధారాలు అడవి మీద ఆధారపడి వుంటాయి. వారి వ్యవసాయం వారి ప్రాంతాల ప్రత్యేకతల మీద ఆధారపడి వుంటుంది. వారి జీవన విధానానికి దగ్గరగా ఉంటుంది. మారిన పంటలలో వ్యవసాయ వ్యాపారస్తుల చొరబాటుతో ఆదివాసులు అతలాకుతలం అవుతున్నారు. తమ సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులని కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. టి.ఆర్.ఎస్. మానిఫెస్టోలో ఆదివాసీ వ్యవసాయం గురించిన మాటే లేదు. వారి జీవనాధారాలని బలపరుస్తామని కానీ, సహజ వనరుల మీద వారి హక్కులను పరిరక్షిస్తామని కాని ఎక్కడా ఊసే లేదు.

**కరువు వల్ల, అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టానికి స్పందన అంతంత మాత్రమే.**

2014 ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణా తీవ్ర కరువుని ఎదుర్కొంది. వర్షపాతం మామూలు వర్షపాతంలో 40శాతమే. చాలా ప్రాంతాలలో వరి, మొక్కజొన్న, పత్తి, పంటలు ఎండిపోయినయ్యి. బోరు, బావులు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వడ్డీ వ్యాపారస్తుల నుంచీ, డీలర్ల నుండి అప్పు తెచ్చి పెట్టిన పెట్టుబడి కూడా వారికి తిరిగిరాలేదు. దెబ్బ మీద దెబ్బ లాగా కరువుకి తోడు, నవంబరు లోను, ఏప్రిల్ లోను కురిసిన అకాల వర్షాలు చేతికొచ్చిన పంటని నాశనం చేసాయి. ప్రస్తుతం వున్న కరువు నియమావళిని ప్రభుత్వం సమీక్షించి మార్చలేదు. మారస్తానని ఎన్నికల మానిఫెస్టోలో వాగ్దానం చేసినా కూడా ప్రస్తుతం జరుగుతున్నట్టుగా కరువు అంచనా మండల స్థాయిలో కాక గ్రామ స్థాయిలో జరగాల్సిన రైతులకే నష్టపరిహారం / భీమా చెల్లించడానికి ఇది అత్యవసరం. ప్రభుత్వం ఇప్పటి దాకా ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించలేదు. అకాల వర్షాల బారిన పడిన రైతులకి ఏ విధమైన సహాయ కార్యక్రమాలు చేపడుతున్నదీ తెలియచేయ లేదు.

**ముగింపు**

వ్యవసాయ రంగంలో తెలంగాణా పనితీరు మొత్తం మీద అంగీకారయోగ్యం కాదు. తీవ్ర సంక్షోభంలో వున్న రైతాంగానికి ఎటువంటి భరోసాను ఇవ్వలేదు. ప్రాథమిక జీవనాధార రంగమైన వ్యవసాయానికి బడ్జెట్ కేటాయింపు అసంతృప్తిగా వున్నది. వ్యవసాయరంగ పునరుజ్జీవానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. వ్యవసాయ ఖర్చులు పెరిగిపోవడము, దళారుల వ్యాపారస్థుల దోపిడి వ్యవసాయం మీద కార్పోరేటు కంపెనీల గుత్తాధిపత్యము, వ్యవసాయ ఉత్పత్తులకి మద్దతు ధరలు, కరువు, అకాల వర్షాలకి సహాయక చర్యలు లాంటి ప్రస్తుత సమస్యలు వేటి మీదా చర్యలు తీసుకోవడం లేదు. ఎన్నో ఆశలతో రైతులు పార్టీని గెలిపిస్తే పార్టీ మాత్రం రైతులని ఓడించింది. వ్యవసాయం మీద ఆధారపడిన చిన్న, సన్నకారు రైతులు, గ్రామీణ ప్రజలు మహిళా రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోంది. వ్యవసాయ సంక్షోభం నుంచి బయటికి రావడానికి వీరికీ ఆదివాసీ రైతులకీ ప్రత్యేకమైన దృష్టిని పెట్టి పరిష్కరించాల్సిన సమయంలో, అందుకు భిన్నంగా ప్రవర్తిస్తోంది.

**సిఫారసులు:**

– సంక్షోభంలో వున్న వ్యవవసాయ రంగాన్ని పునరుజ్జీవంప చేయడానికి సమగ్ర వ్యవసాయ విధానాన్ని కొత్తగా ఏర్పడ తెలంగాణా రాష్ట్రం ప్రకటించాలి. ఈ విధానం వేరు వేరు జిల్లాలో స్థానిక పరిస్థితులకి అనుగుణంగా వుండాలి. ఈ సమగ్ర విధానం చిన్న, సన్నకారు రైతుల కౌలు రైతుల, మహిళా రైతుల, ఆదివాసీ రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తయారు చేయాలి.

– 1995 నుండి పోలీసు స్టేషన్లలో నమోదయిన రైతు ఆత్మహత్యలన్నింటి మీద క్షుణ్ణంగా విచారణ జరపాలి. కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అయిదు లక్షలకి పెంచాలి. ఈ మేరకు ఒక కొత్త జీ.వోను విడుదల చేయాలి. వారి పిల్లల చదువుల బాధ్యత పూర్తిగా ప్రభుత్వాలే తీసుకోవాలి.

– కౌలు రైతులకి రుణ అర్హత (ఎల్.ఇ.సి) కార్డులు జారీ చేసే పనిని వెంటనే మొదలు పెట్టాలి. పాలుకు తీసుకొనే రైతులను కూడా కౌలు రైతులుగా గుర్తించి వారికి కూడా రుణ అర్హత (ఎల్.ఇ.సి) కార్డులను ఇవ్వాలి.

– ఎల్.ఇ.సి. కార్డులు వున్న కౌలుదారులకి తాజాగా బ్యాంకు రుణాలను ఇవ్వాలి. భూమీ సొంతదారుకి రుణమాఫీ చేయడంతో దీనికి సంబంధం వుండకూడదు.

– తెలంగాణాలో వ్యవసాయం ప్రధానంగా వర్షాధారం. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని పంటలకి పశువులకి మధ్య వున్న సంబంధాన్ని గుర్తించి వర్షాధారిత సమగ్ర వ్యవసాయాన్ని బలపరిచే విధంగా బడ్జెట్ కేటాయింపులు వుండాలి. బీ.టీ. పత్తి, మొక్కజొన్న, వరికి బదులుగా చిరుధాన్యాలు, పప్పులు వైవిధ్యమైన పంటలు పండించే విధంగా మారాలి.

– స్థానిక విత్తనాలను భద్రపరచాలి. రైతులకి విత్తనాల మీద హక్కులని పునరుద్ధరించాలి. రైతులను ముఖ్యంగా మహిళా రైతులను వివిధ రకాల ఆహార పంటల విత్తనాలు ఉత్పత్తి చేసే విధంగా ప్రోత్సహించాలి. రైతులు

ఉత్పత్తి చేసిన విత్తనాలను ప్రభుత్వాలే సేకరించి స్థానిక రైతులకి పంపిణి చేయాలి. ఈ విధంగా చేస్తే గుత్తాధిపత్యం చెలాయిస్తున్న కంపెనీలను తొలగించడానికి కుదురుతుంది.

– వ్యవసాయంలో 80 శాతం పని చేస్తున్న స్త్రీలను రైతులుగా గుర్తించాలి. మహిళా రైతులకు భూమి హక్కులను కల్పించాలి. వారి పేరు మీద భూమి వుంటే మహిళలు బ్యాంకులోన్లు, ప్రభుత్వం నుంచి ఇతర సహాయాలు పొందుగలుగుతారు. మహిళా రైతు సహకార సంఘాలను ప్రోత్సహించాలి. అవసరమైన సహాయాన్ని అందించాలి. తద్వారా మహిళలు వ్యవసాయం లాభసాటి జీవనాధారంగా కొనసాగించ గలగాలి.

– వ్యవసాయానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. అందువల్ల ఆదాయ భద్రత, ఆహార భద్రత, జీవనాధార భద్రత, పర్యావరణ పరిరక్షణ జరగాలి.

– వ్యవసాయానికి బడ్జెట్ కేటాయింపులు పెంచడం ద్వారా మెరుగైన గిట్టుబాటు ధరలు, నిజమైన వ్యవసాయదారులకి పంట రుణాలు, పంట భీమాలు ఇవ్వగలగాలి.

– రైతు సేవా కేంద్రాలకు (5 గ్రామాల క్లస్టర్) కేటాయింపులు చేయాలి. ఈ కేంద్రాలు విస్తరణ, ఇన్‌పుట్స్, సబ్సిడీలు, అప్పులు, భీమా, సేవలను ఒకే చోట నుంచి అందించాలి.

(డా॥ రామాంజనేయులు, ఎస్. ఆశాలత, డా॥ ఎస్.సీతాలక్ష్మి, రవి కన్నెగంటి, కె. సజయ, డా॥ వి.రుక్మిణిరావ్, ఎమ్. జనార్ధన్, బి. కొండల్, బీరం రాములు, పి.శంకర్, నవీన్, ఎస్.బొర్రన్న, ఎస్.ప్రవీణ్ – రైతు స్వరాజ్య వేదిక)

**ఎస్. ఆశాలత**

**రైతుస్వరాజ్య వేదిక.**

(వాదా నా తోడో అభియాన్ వారి సౌజన్యంతో...)